E KABURU - Digital News Paper E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
హైదరాబాద్ (తేదీ) 01-06-2026 (వారం) ఆదివారం సంపుటి: 02 || సంచిక:149|| పేజీలు–6
www.ekaburu.com



## పగలు ఎండ.. రాత్రి వాన

02



03

## క్రీడాకారుల జుగల్‌బందీ

- అథ్లెటిక్స్‌లో వరుస రికార్డులతో దేశ కీర్తిని పెంచారు
- 'మన్ కీ బాత్'లో ప్రధాని ప్రశంస

# రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయాలు



- ఉద్యోగులకు గుడ్‌న్యూస్
- ప్రజల కోసం 'యూనిఫైడ్ స్మార్ట్ కార్డ్'!
- ప్రతి పౌరుడికి సంక్షేమ పథకాలు అందేలా సమగ్ర సంక్షేమ కార్డు
- గ్రామాలకు హైస్పీడ్ ఇంటర్నెట్
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు


**ఈ కబురు, హైదరాబాద్ :**

తెలంగాణ ఉద్యోగులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. 100 రోజుల్లో రూ.6 వేల కోట్ల బకాయిలు విడుదల చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉద్యోగ సంఘాల నాయకులకు ఇటీవల హామీ ఇచ్చారు. ఇందులో తొలి విడత రూ.2 వేల కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. మిగిలిన రూ.4 వేల కోట్లు కూడా త్వరలోనే జమ చేస్తామని ప్రభుత్వం తెలిపింది. రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ బకాయిలు 100 శాతం ప్రభుత్వం క్లియర్ చేసింది.


మిగతా 2లో

## రెండో కప్పు.. భలే కిక్కు

- ఐపీఎల్-19 విజేత బెంగళూరు
- టైటిల్ నిలబెట్టుకున్న పాటీదార్ సేన
- ఛేదనలో మెరిసిన కోహ్లి
- విజృంభించిన భువి, హేజిల్‌వుడ్, రసిఖ్
- ఫైనల్లో టైటాన్స్ ఓటమి అహ్మదాబాద్



06



## దశాబ్దాల కల నెరవేరుతోంది ..సీఎం చంద్రబాబు

02

# ఖర్గేకు స్వాగతం

- గుల్బర్గా వెళ్తూ హైదరాబాద్‌లో ఆగిన ఏఐసీసీ అధ్యక్షుడు
- సీఎం, డిప్యూటీ సీఎం, పీసీసీ చీఫ్ తదితరులతో అల్పాహార విందు



మిగతా 2లో

## రైతు డిస్కం ఏర్పాటు చేసి మిగతా రెండు డిస్కంలు..
# ప్రైవేట్ పరం చేసే కుట్ర

- తాము అలాంటి ప్రయత్నాలు చేయడం లేదని ఈ సీఎం ప్రెస్ మీట్ పెట్టి చెప్పగలరా?
- ఉచిత విద్యుత్ తీసేయం, మోటార్లకు మీటర్లు పెట్టబోమని ప్రజలకు స్పష్టతనివ్వాలి
- విద్యుత్ సంస్కరణాల్లో భాగంగా కేంద్రం చేపడుతున్న చర్యలకు రాష్ట్రం వత్తాసు పలుకుతోంది
- రైతులకు సంబంధించి డిస్కం విషయంలో ఈఆర్సీ వారి అభిప్రాయాలు తీసుకోవాలి
- రైతులకు నష్టం చేసే ఈ డిస్కం కు ఈఆర్సీ ఎట్టి పరిస్థితుల్లో పర్మిషన్ ఇవ్వొద్దు
- తెలంగాణ జాగృతి తరపున కేసు కూడా వేశాం. పర్మిషన్ ఇస్తే సుప్రీంకి వెళ్లైనా అడ్డుకుంటాం
- దసరా లోపు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ప్రారంభించకపోతే తెల్లారి నుంచే పాదయాత్ర
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

03



# పెట్టుబడులే టార్గెట్



02

- రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రేపటి నుంచి మంత్రి లోకేష్ రష్యా పర్యటన
- జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు రష్యాలో పర్యటించనున్న లోకేష్
- సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక ఫోరంలో పాల్గొనాల్సిందిగా ఆహ్వానం
- పర్యటనలో భాగంగా పలువురు పారిశ్రామికవేత్తలతో భేటీ కానున్న మంత్రి

## డబ్బుల్లేవ్..ఓపిక పట్టండి!

- కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 'ఆర్థిక పాఠాలు'
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేదు..ఖర్చుకు సరిపడా రాబడి లేదు
- ఆదాయానికి, వ్యయానికి మధ్య నెలకు రూ.2,200 కోట్ల వరకు అంతరం



02



03

## ప్రశ్నిస్తే అవమానిస్తున్నారు

- ఓఎస్ఎం వివాదంలో విద్యార్థులకు రాహుల్ బాసట

## అది రైతులను చంపేసే డిస్కమ్!

- రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే 24 గంటల కరెంటు సరఫరా ఎగ్గొట్టేందుకే రైతు డిస్కమ్ పాట
- రైతు బంధు పడకున్నా.. రాహుల్ బంధుకు నెలనెలా పడుతున్నాయ్..

03



# ఖర్గేకు స్వాగతం



ఈ కబురు, హైదరాబాద్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం హైదరాబాద్ వచ్చారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్ మీదుగా గుల్బర్గా వెళ్తున్న ఆయన కొద్దిసేపు హైదరాబాద్‌లో ఆగారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌లు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం నోవాటెల్ హోటల్‌లో ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో ఖర్గే ప్రత్యేకంగా సమావేశమయ్యారని, ఇటీవల జరిగిన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) వివరాలతో పాటు రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి ఖర్గేకు మహేశ్‌గౌడ్ వివరించారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

# పెట్టుబడులే టార్గెట్




ఈ కబురు, అమరావతి
రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ రష్యాలో పర్యటించనున్నారు. జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు ఆయన రష్యాలో పర్యటించి, పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించి, వారిని ఏపీకి ఆహ్వానించడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం.రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరగనున్న ప్రతిష్ఠాత్మక 'సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరమ్' (SPIEF'26) సదస్సులో పాల్గొనాల్సిందిగా మంత్రి లోకేష్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల నుంచి పారిశ్రామికవేత్తలు, ఆర్థిక నిపుణులు ఈ సదస్సుకు హాజరవుతారు.ఈ పర్యటనలో భాగంగా, లోకేష్ పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ముఖ్యంగా ఐటీ, విద్య, ఇతర కీలక రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆయన చర్చలు జరపనున్నారు. ఈ పర్యటన ద్వారా రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

# దశాబ్దాల కల నెరవేరుతోంది

## .. సీఎం చంద్రబాబు

- **జూన్ 1 నుంచి విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభం**
- **ఇది చారిత్రాత్మక మైలురాయి అని సీఎం చంద్రబాబు వ్యాఖ్య**
- **ఆకాంక్షను నెరవేర్చిన ప్రధాని మోదీకి, రైల్వే మంత్రికి ధన్యవాదాలు**
- **ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఈ జోన్ కీలకం కానుందని వెల్లడి**



**ఈ కబురు,అమరావతి ;**
విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ రేపు (జూన్ 1న) అధికారికంగా ప్రారంభం కానుండటంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మక మైలురాయి అని, దశాబ్దాల కల నెరవేరుతోందని ఆయన అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.నూతన రైల్వే జోన్‌తో ఉత్తరాంధ్ర రవాణా ముఖచిత్రం సమూలంగా మారిపోతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. దీనివల్ల కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించబడటంతో పాటు పారిశ్రామిక వృద్ధికి కూడా బాటలు పడతాయని తెలిపారు. రాష్ట్రాన్ని ఒక లాజిస్టిక్స్ హబ్‌గా మార్చే ప్రభుత్వ లక్ష్యానికి ఈ పరిణామం ఎంతో దోహదపడుతుందని వివరించారు.ఏపీ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు రాష్ట్ర ప్రజల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చంద్రబాబు తన ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త రైల్వే జోన్ ఏర్పాటుతో ఈ ప్రాంత అభివృద్ధి వేగవంతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయాలు



**సీఎం రేవంత్ కీలక ఆదేశాలు**
రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో అందుబాటులో ఉండేలా సమగ్ర సంక్షేమ కార్డు రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద, ఎంత మేర లబ్ధి చేకూరుతోందో ఈ కార్డు ద్వారా స్పష్టంగా తెలిసేలా ఉండాలని సూచించారు. అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటాను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు అందుతున్న అన్ని డిజిటల్ సేవలను ఒకే వేదికపైకి తీసుకురావడమే కాకుండా, మరింత పారదర్శకతను పెంచేందుకు యూనిఫైడ్ స్మార్ట్ కార్డును తీసుకురావడమే దీని ఉద్దేశం. ఈ విధానం అనుసరించడం వల్ల నిజమైన అర్హులకు పథకాలు మరింత కచ్చితంగా చేరుతాయని, అదే సమయంలో అనర్హులను గుర్తించడం సులభమవుతుందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ కార్డ్‌లో ఆరోగ్యశ్రీ, సీఎం సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ, విద్యా శాఖ, బీమా పథకాలు, ప్రభుత్వం తీసుకొస్తున్న బీమా పథకాల వివరాలు ఉండేలా డిజైన్ చేస్తున్నారు.

**అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ**
హైదరాబాద్ అమీర్‌పేటసర్కిల్‌లో ఏర్పాటు చేసిన విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా ఇచ్చిన హామీకి అనుగుణంగా ఆయన జయంతి రోజునే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారతదేశ ఉక్కు మహిళ ఇందిరా గాంధీ, తెలుగుజాతి గర్వించదగిన నాయకుడు ఎన్ టీ రామారావుల స్ఫూర్తితో రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామన్నారు సీఎం రేవంత్. ఈ సందర్భంగా ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు. రాష్ట్రంలో 3.24 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని.. దానికి ఎన్టీఆర్ 2 రూపాయలకే కిలో బియ్యం పథకం స్ఫూర్తి అన్నారు రేవంత్ రెడ్డి. ఎన్టీఆర్ అమలు చేసిన కూడు, గుడ్డ, నీడ నుంచి స్ఫూర్తితో అనేక సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నామని తెలిపారు.

**గ్రామాలకు హైస్పీడ్ ఇంటర్నెట్..**
తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాలకు నిరంతరం హైస్పీడ్ బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటీని అందించే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి పని చేస్తున్నారు. ఇందుకోసం అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ సజావుగా అమలు చేయడానికి సీఎం రేవంత్ కొన్ని కీలక అంశాలను కేంద్ర సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రోగ్రామ్‌కు సంబంధించి సాధ్యమైనంత తొందరగా ఒప్పందాన్ని కుదుర్చుకోవడం, పెండింగ్‌లో ఉన్న నిధులను సత్వరం విడుదల చేయడం వంటి అంశాలపై చర్చించారు. మండలం నుంచి గ్రామ పంచాయతీ రింగ్ నెట్‌వర్క్ వ్యవస్థలను డిజిటల్ భారత్ నిధికి బదిలీ చేయడంపై స్పష్టమైన విధానం ఉండాలని కేంద్ర మంత్రిని కోరారు. వీటిపై సింధియా సానుకూలంగా స్పందించారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి దశలో, నెట్‌వర్క్ దెబ్బతిన్న ఉమ్మడి నిజామాబాద్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లోని 3,089 గ్రామాలకు డిజిటల్ కనెక్టివిటీ పునరుద్ధరిస్తారు.

**ఫడ్నవీస్‌కు సీఎం రేవంత్ లేఖ..**
తుమ్మిడిహెట్టి బ్యారేజ్ ఎత్తు, నిర్మాణంపై మహారాష్ట్రతో చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగు ముందుకేసింది. సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌కు లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందంతో సమావేశానికి సమయమివ్వాలని, అనుకూలమైన తేదీని త్వరగా ఖరారు చేయాలని సీఎం కోరారు. డా. బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత - చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజ్ నిర్మించాల్సి ఉంది. మొదటి ప్రతిపాదనలో ఈ బ్యారేజ్ 152 మీటర్ల ఎత్తు నిర్మించాలనుకున్నారు. అయితే 148 మీటర్ల ఎత్తులో బ్యారేజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. 148 మీటర్ల కంటే కొంత ఎక్కువ ఎఫ్ఆర్ఎల్‌ను పరిశీలించినా, మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువగానే ఉంటుందనేది తెలంగాణ వాదన. ఎఫ్ఆర్ఎల్ పెరిగితే గ్రావిటీ ద్వారా తెలంగాణకు నీటిని తెచ్చుకునే వీలుందని లేఖలో ప్రస్తావించారు సీఎం రేవంత్.

**ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు**
వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయడంతో వర్షాలపై సీఎం రేవంత్ రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అదనపు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇప్పటికే కొనుగోళ్లు పూర్తైన కేంద్రాల నుంచి టార్పాలిన్లను తరలించాలన్నారు సీఎం రేవంత్.

**పంచాయతీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..**
రాష్ట్రంలోని 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెలా మొదటి తారీఖునే జీతాలు చెల్లించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు సీఎం రేవంత్ రెడ్డి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన సందర్భంలో ఈ వ్యాఖ్యలు చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాలు చెల్లించడానికి ప్రభుత్వం నుంచి ప్రతినెలా 50 కోట్లు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తామన్నారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు అనే తేడా లేకుండా ప్రభుత్వంలోని అన్ని శాఖల పరిధిలోని ఉద్యోగులకు మొదటి తారీఖునే జీతాలు అందేలా చూడాలని స్పష్టం చేశారు.

**పెన్షన్ పంపిణీలో కీలక మార్పు..**
పెన్షన్ల పంపిణీ విధానంపై ముఖ్యమంత్రి గారు అధికారులకు కీలక ఆదేశాలిచ్చారు. పోస్టల్ శాఖ ద్వారా అందజేస్తున్న ప్రస్తుత పెన్షన్ పంపిణీ విధానాన్ని మార్చి నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని చెప్పారు. పెన్షన్లు అర్హులకు మాత్రమే అందేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్, సర్వే డేటా ఆధారంగా పెన్షన్లను క్రమబద్ధీకరించాలని చెప్పారు.

**తెలంగాణ ప్రభుత్వ భారీ లక్ష్యం**
2034 నాటికి కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు వెళుతుంది. మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగడానికి అన్ని నియోజకవర్గాల కేంద్రాల్లో కార్పొరేట్ స్థాయిలో మహిళా శక్తి సూపర్ బజార్లు ప్రారంభించడానికి వీలుగా సమగ్ర ప్రణాళికలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. సూపర్ బజార్లతో పాటు మహిళలు వ్యాపార రంగంలో మరింతగా రాణించడానికి స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ప్రతి మండలంలో రైస్ మిల్లులు, గోడౌన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

**–మహిళా సంఘాలకు రుణాల భరోసా..**
బ్యాంకుల నుంచి వీటికి అవసరమైన రుణాలను ఇప్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల కోసం 8 వేల ఇందిరా స్త్రీ శక్తి భవనాలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని అమెరికన్ తెలుగు అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. జూలై 31 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు మేరీలాండ్ బాల్టిమోర్ లో నిర్వహించనున్న అసోసియేషన్ 19వ తెలుగు మహాసభలకు హాజరుకావాలని సీఎంను ఆహ్వానించారు.

**ధాన్యం కొనుగోళ్లపై సీఎం స్పష్టత..**
రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నామన్నారు సీఎం రేవంత్ రెడ్డి. మద్దతు ధరలు ప్రకటించడమే తప్ప కేంద్రం రాష్ట్రంలో పంటను కొనుగోలు చేయడం లేదని, కనీసం 30 శాతం కూడా సేకరించడం లేదని వివరించారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కారణంగా హమాలీలు తరలివెళ్లడంతో ఇక్కడ కొంత కొరత ఏర్పడిందని, అలాగే ఎండల కారణంగా మధ్యాహ్నం సమయంలో పని జరగడం లేదన్నారు. ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం సమీక్ష చేస్తున్నానని తెలిపారు. సన్నవడ్లకు రూ. 500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తున్నామని, మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని గుర్తుచేశారు.

# డబ్బుల్లేవ్..ఓపిక పట్టండి!



ఈ కబురు, హైదరాబాద్: 'రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేదు. ప్రతి నెలా అవుతున్న ఖర్చులకు ఖజానాకు వచ్చే రాబడులు సరిపోవడం లేదు. అనివార్య ఖర్చులు పెరిగిపోతున్నాయి. అదనపు ఆదాయం వచ్చే మార్గాలు కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో కొత్త పథకాలను అమలు చేయలేకపోతున్నాం. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలులో భాగంగా సామాజిక పింఛన్లు పెంచేందుకు ఎంత ప్రయత్నించినా నిధులు సమకూరడం లేదు. మీమీ నియోజకవర్గాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం డబ్బులు ఇప్పట్లో ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కొన్నాళ్లు సర్దుకుపోవాల్సి ఉంటుంది. ఆర్థిక పరిస్థితి మెరుగుపడిన తర్వాత యుద్ధ ప్రాతిపదికన క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులను ముమ్మరం చేస్తాం..' అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఆర్థిక పాఠాలు చెబుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటై రెండున్నరేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో పార్టీ ప్రజా ప్రతినిధులకు వాస్తవ పరిస్థితులను తెలియజెప్పాలనే ఆలోచనతో ఉమ్మడి జిల్లాల వారీగా ఆయన ఎమ్మెల్యేలతో సమావేశమవుతున్నారు. ఇప్పటివరకు ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నల్లగొండ జిల్లాల ఎమ్మెల్యేలు, మంత్రులతో సమావేశమైన ఆయన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరిస్తూనే, ఆదాయం పెంచుకునే మార్గాల గురించి ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాలని కోరుతున్నట్టు సమాచారం.

ప్రజలపై పన్నులు వేయకుండా నెట్టుకొస్తున్నాం..
విశ్వసనీయ సమాచారం ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వ ప్రస్తుత ఆర్థిక పరిస్థితి గురించి భట్టి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరణ ఇస్తున్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వచ్చిన రాబడులు, చేసిన అప్పులు, కాంగ్రెస్ హయాంలో ఆదాయ, వ్యయాలను సంవత్సరాల వారీగా తెలియజేస్తున్నారు. 'ప్రస్తుతం ప్రతి నెలా రూ.16-17 వేల కోట్ల వరకు ఆదాయం వస్తుంటే రూ.18-20వేల కోట్ల వరకు ఖర్చులవుతున్నాయి. ఆదాయం కంటే ప్రతి నెలా రూ.2,200 కోట్ల వరకు అధికంగా వ్యయమవుతోంది. ఈ పరిస్థితుల్లో కొత్త పథకాల అమలు అసాధ్యం. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలపై రూపాయి కూడా అదనంగా పన్ను వేయకుండా నెట్టుకొస్తున్నాం. జీఎస్టీ, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్లు, వాహనాలకు పన్నులు, కేంద్రం నుంచి వచ్చే నిధులు, ఇతర ఆదాయంతో సర్దుకుంటున్నాం. పాత పథకాలేవీ తీసేసే పరిస్థితి లేదు. సంక్షేమ పథకాల అమలుకు, ఉద్యోగుల జీతాలు, పింఛన్లకు ప్రతి నెలా నిధులిస్తున్నాం.

పాత అప్పులే పీకల దాకా..
కొత్త అప్పులు తెచ్చినా పరిస్థితిలో మార్పు రావడం లేదు. పాత అప్పులే పీకల వరకు ఉన్న నేపథ్యంలో తెచ్చిన దాని కంటే ఎక్కువగా అప్పులు కట్టాల్సి వస్తోంది. వీటికి తోడు అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపులు, పరిపాలనా వ్యయం, విద్య, వైద్యం వంటి కీలక రంగాల నిర్వహణ కోసం కష్టపడాల్సి వస్తోంది. ఏరోజుకారోజు సర్దుకోవాల్సిన పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయి. ఈ ఏడాది మొత్తం ఇదే పరిస్థితి ఉంటుందని అంచనా వేస్తున్నాం. ఆర్థిక పరిస్థితిని దారిలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. మీమీ నియోజకవర్గాల్లో అభివృద్ధి నిధుల కోసం కొంచెం ఓపిక పట్టండి. పరిస్థితిని ప్రజలకు అర్థమయ్యేలా వివరించండి..' అని భట్టి చెబుతున్నట్టు తెలిసింది.

ఏం చేయొచ్చో చెప్పండి
ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకునేందుకు ఉన్న మార్గాల గురించి సలహాలు, సూచనలు ఇవ్వాలని ఎమ్మెల్యేలను డిప్యూటీ సీఎం కోరుతున్నారు. ఈ సమావేశాల్లో పాల్గొన్న కరీంనగర్‌కు చెందిన ఓ ఎమ్మెల్యే 'సాక్షి'తో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని తెలియజేయడం మంచిదే. మేం కూడా కొన్ని సలహాలిచ్చాం. పాత పథకాలేవీ తీసేయవద్దని చెబుతూనే కొంతమేరకు క్రమబద్ధీకరించాల్సిన ఆవశ్యకతను వివరించాం. రైతు భరోసాను కుదించాలని, పింఛన్లు ప్రతి యేటా కొంత పెంచాలని, ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ బీమా లాంటి పథకాలు ప్రజల్లో మంచి పేరు తెస్తాయని, అవసరమైతే నిరుపయోగమైన ప్రభుత్వ భూములను అమ్మడం ద్వారా ఆదాయ వనరులు పెంచుకునే అవకాశాలను పరిశీలించాలని సూచించాం. పార్టీ కార్యకర్తలు గతంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఇవ్వాలని అడిగాం. మా నియోజకవర్గాల్లోని రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన గురించి ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకెళ్లాం. రిజిస్ట్రేషన్ల రేట్లు పెంచినా పర్వాలేదని చెప్పాం. ఇచ్చిన హామీలను అమలు చేసిన తర్వాతే ఓట్ల కోసం వచ్చామనే భావన ప్రజల్లో కలిగించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించాం..' అని వెల్లడించారు.

# పగలు ఎండ.. రాత్రి వాన



ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్రంలో పగలంతా ఎండ, పొద్దుపోయే సమయానికి భారీ వర్షాలు.. ఇటువంటి భిన్నమైన వాతావరణం రైతులతోపాటు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఎటువంటి సంకేతాలు లేకుండానే ఒక్కసారిగా భారీ గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడుతున్నాయి. ఇటీవల పలు జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలకు పంట దిగుబడులు కొట్టుకుపోయాయి. కల్లాలు, వాహనాల్లో నింపిన ధాన్యమంతా వానపాలైంది. జూన్ ఆరో తేదీ వరకు ఇలాంటి వర్షాలు కురిసే అవకాశాలున్నాయని భారత వాతావరణశాఖ(ఐఎండీ) ఆదివారం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో (గంటకు 4050 కి.మీ. వేగం) కూడిన వర్షాలు కురవనున్నట్లు తెలిపింది. అన్ని జిల్లాల్లో ఈ వర్షాలు కురుస్తాయని, పసుపు రంగు హెచ్చరికలు జారీ చేసింది.

ఎండల తీవ్రత కూడా..
రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఎండల తీవ్రత కొనసాగుతుందని ఐఎండీ పేర్కొంది. సోమవారం ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, జగిత్యాల, నిజామాబాద్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో 44 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తెలిపింది. మంగళ, బుధ, గురువారాల్లోనూ ఇదే పరిస్థితి ఉంటుందని పేర్కొంది. ఆదివారం రాష్ట్రంలోనే అత్యధికంగా ఖమ్మం జిల్లా గ్రామీణ మండలంలో 45.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. మరో 29 జిల్లాల్లో 40.1 నుంచి 44.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదుకాగా, జోగులాంబ గద్వాల, వికారాబాద్, నారాయణపేట జిల్లాల్లో 39.639.8 డిగ్రీలు నమోదయ్యాయి. ములుగు జిల్లా వాజేడు, మంగపేట, ఏటూరునాగారం మండలాల్లో వడగాలులు నమోదయ్యాయి.

ఈ ఏడాది వేసవి రాష్ట్రాన్ని అల్లాడించింది. నిజామాబాద్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో గత రికార్డులను అధిగమిస్తూ పలుమార్లు 46.5 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అనేక ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు వారానికన్నా ఎక్కువ రోజులు నమోదయ్యాయి. గత ఐదేళ్లలో ఈ ఏడాదే వడగాలులతో ఎక్కువ మరణాలు సంభవించినట్లు అంచనా వేస్తున్నారు. సోమవారం నుంచి వానాకాలం ప్రారంభం కానున్నప్పటికీ రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకేందుకు పది రోజులకు పైగానే సమయం పడుతుందని అంచనా. ఆరో తేదీ తరువాత వాతావరణం కొంత చల్లబడుతుందని పేర్కొంటున్నారు.

# రైతు డిస్కం ఏర్పాటు చేసి మిగతా రెండు డిస్కంలు ప్రైవేట్ పరం చేసే కుట్ర



ఈ కబురు,హైదరాబాద్:
రైతు డిస్కం పేరుతో రేవంత్ రెడ్డి సర్కార్ కొత్త డిస్కంను ఏర్పాటు చేసి మిగతా రెండు డిస్కంలను ప్రైవేట్ పరం చేసే కుట్ర చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. తాము ఆ ప్రయత్నం చేయటం లేదని ప్రెస్ మీట్ పెట్టి చెప్పే దమ్ము సీఎం కు ఉందా అని సవాల్ విసిరారు. రైతు డిస్కం ఏర్పాటు ద్వారా ఉచిత విద్యుత్, మోటార్లకు మీటర్లు పెట్టమంటూ మీడియాతో చిట్ చాట్ లో సీఎం మాట్లాడిన అంశాలపై కవిత కౌంటర్ ఇచ్చారు. బంజరాహిల్స్ లో తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఆదివారం ప్రెస్ మీట్ లో మాట్లాడారు. ఈ ముఖ్యమంత్రి ఉచిత విద్యుత్ ఎత్తివేయని చెప్తుంటేనే ఇంకా ఎక్కువ అనుమానించాల్సి వస్తోందన్నారు. చిట్ చాట్ లో కాకుండా అవే విషయాలను ప్రెస్ మీట్ ద్వారా ప్రజలకు చెప్పాలన్నారు. బహిరంగ సభల్లో ఇచ్చిన హామీలనే పట్టించుకోని ఈ సీఎం ఇప్పుడున్న చెబుతున్న మాటలకు కట్టుబడి ఉంటాడని నమ్మకం లేదన్నారు. రైతులకు నష్టం చేసే రైతు డిస్కం కు ఈఆర్సీ ఎట్టి పరిస్థితుల్లో పర్మిషన్ ఇవ్వొద్దని కోరారు. ఒకవేళ పర్మిషన్ ఇస్తే సుప్రీంకోర్టుకు వెళ్లైనా సరే దాన్ని అడ్డుకుంటామన్నారు. ఇప్పటికే తెలంగాణ జాగృతి తరఫున కేసు వేసినట్లు కవిత చెప్పారు.

**ప్రైవేట్ పరం చేయమని చెప్పే దమ్ముందా?**

రైతు డిస్కం గురించి ఆరు నెలల పాటు సీక్రెట్ గా ఉంచిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు చిట్ చాట్ పేరుతో దొంగచాటుగా మాట్లాడుతున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల ఆరోపించారు. రైతు డిస్కం కారణంగా ఉచిత విద్యుత్, రైతుల మోటార్లకు మీటర్లు పెడతారని మేము మాట్లాడితే కాదని ఆయన అంటున్నారని చెప్పారు. కానీ ఇదే విషయాన్ని ఎందుకు ప్రెస్ మీట్ పెట్టి చెప్పటం లేదని ప్రశ్నించారు. బహిరంగ సభల్లోనే ఎన్నో హామీలు ఇచ్చి ఎగ్గొట్టిన ఈ ముఖ్యమంత్రి చిట్ చాట్ లో మాట్లాడే మాటలపై జవాబుదారీగా ఉంటారా అని అనుమానం వ్యక్తం చేశారు. రైతు డిస్కం పేరుతో కొత్తగా డిస్కం ఏర్పాటు చేసి మిగతా రెండు డిస్కం లను ప్రైవేట్ పరం చేసే కుట్ర చేస్తున్నారని కవిత ఆరోపించారు. నిజంగా ప్రైవేట్ పరం చేసే ఆలోచన లేకుంటే...డిస్కం లను ప్రైవేట్ పరం చేస్తే వచ్చే ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్లమని చెప్పే ధైర్యం ఉందా అని సవాల్ విసిరారు. ఈ ముఖ్యమంత్రి అంత గట్టిగా చెప్పినప్పటికీ మాకు నమ్మకం కుదరక పోవటానికి గత చేదు అనుభవాలే కారణమన్నారు. ఈ సారి రైతు భరోసా ఇప్పుడు రెండు ఎకరాల లోపు వారికే ఇచ్చారు. రైతు రుణ మాఫీ 30 శాతం మందికి కూడా కాలేదు. బోనస్ ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారు. చివరి గింజ వరకు ధాన్యం కొంటమని చెప్పి ఇప్పటికీ కొనుగోలు సరిగా చేయటం లేదని గుర్తు చేశారు. రైతు బీమాను యాక్సిడెంటల్ బీమాగా మార్చేసే కుట్ర చేశారన్నారు. ఇప్పటి వరకు ఈ ప్రభుత్వం చేపట్టిన అన్ని చర్యలు రైతులకు వ్యతిరేకంగానే ఉన్నాయన్నారు. అందుకే ముఖ్యమంత్రి చెప్పే మాటల మీద నమ్మకం కుదరటం లేదని కవిత అన్నారు.

**అడ్డుకొని తీరుతాం**

రైతు డిస్కం ను ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకొని తీరుతామని కవిత స్పష్టం చేశారు. రైతులకు నష్టం చేసే ఈ ప్రపోజల్ ను ఈఆర్సీయే రిజెక్ట్ చేయాలని కోరారు. కొత్త డిస్కం లో రైతులే వినియోగదారులుగా ఉంటారు కనుక ఈఆర్సీ వారి అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు. మొత్తం 33 జిల్లాల్లో పబ్లిక్ హియరింగ్ నిర్వహించాలన్నారు. ఈఆర్సీ ఈ ప్రపోజల్ కు ఒకే చెబితే న్యాయం పోరాటం చేస్తామని కవిత స్పష్టం చేశారు. ఇప్పటికే దీనిపై స్వచ్ఛంద సంస్థ అయిన తెలంగాణ జాగృతి తరఫున కేసు ఫైల్ చేశామన్నారు. సుప్రీంకోర్టు లో పోరాటం చేసైనా సరే రైతు డిస్కంను అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

**చిన్న సంస్థలకు మరణశాసనం**

కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో చేస్తున్న కుట్రలకు రాష్ట్ర సర్కార్ వత్తాసు పలుకుతోందని కవిత అన్నారు. కేంద్రం ఇస్తోన్న ఒక్కో జీవో కు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ఉంటున్నాయని చెప్పారు. విద్యుత్ సంస్కరణల్లో భాగంగా దేశంలో సోలార్ ప్యానెల్స్ తయారు చేసే చిన్న సంస్థలకు కేంద్రం మరణశాసనం లిఖిస్తోందని మండిపడ్డారు. సోలార్ ప్యానెల్స్, బ్యాటరీలు ఇండియాలోనే తయారు చేసే కంపెనీలకే అవకాశం అంటూ కొత్తగా జీవో తెచ్చి 5 రోజులు మాత్రమే సమయం ఇచ్చారని అన్నారు. అలా అయితే రిలయన్స్, అదానీ సంస్థలకు మాత్రమే అవకాశం ఉంటుందని చెప్పారు. లక్షలాది మంది చిన్న వ్యాపారులకు నష్టం చేసే ఈ అంశాన్ని కేంద్రం వెంటనే వెనక్కి తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. చిన్న వ్యాపారులంతా త్వరలోనే ఆందోళన చేపడతామని చెప్పారని వారికి తమ మద్దతు ఉంటుందన్నారు.

**లక్ష్మీదేవిపల్లిలో రిజర్వాయర్ కట్టకపోతే**

**పాదయాత్ర చేస్తా**

అటు పాలమూరు ప్రాజెక్ట్ కు సంబంధించి ప్రభుత్వం పనులను వేగవంతం చేయాలని కోరారు. ఈ అంశంలో తాము పదే పదే ప్రశ్నించటంతో ముఖ్యమంత్రి రివ్యూ చేస్తానని చెప్పారన్నారు. అందులో భాగంగా కుమ్మెర అనే గ్రామానికి వెళ్తున్నట్లు తెలిసిందన్నారు. ఐతే అదే గ్రామంలో కులవివక్షతో ఒక పసిగుడ్డును చంపేశారని కవిత గుర్తు చేశారు. ముఖ్యమంత్రి కచ్చితంగా ఆ కుటుంబాన్ని పరామర్శించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా తాము డిమాండ్ చేసినట్లు దసరా లోపు పాలమూరు ప్రాజెక్ట్ లో భాగంగా లక్ష్మీదేవిపల్లి లో రిజర్వాయర్ పనులను ప్రారంభించాలన్నారు. లేదంటే ఆ మరుసటి రోజు నుంచే పాదయాత్ర చేస్తానని కవిత హెచ్చరించారు. ఇక రాష్ట్రంలో ఉన్న స్కూళ్లను బాగు చేయాలంటూ, హైడ్రా తీరు గురించి కూడా కోర్టు ఈ ప్రభుత్వంపై అక్షింతలు వేస్తున్న పట్టించుకోవటం లేదని మండిపడ్డారు. కోర్టు తిడుతున్నప్పటికీ ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే మీడియా మాత్రం హైడ్రాను సమర్థిస్తూ వార్తలు రాయటం బాధకరమన్నారు. పెద్దవాళ్లను కాపాడుతూ పేదవాళ్ల ఇళ్లను హైడ్రా కూల్చుతుందని చెప్పారు. బడా వ్యక్తులు చేసే కబ్జాలపై నేను ఇచ్చిన ఫిర్యాదులను హైడ్రా పక్కన పెట్టిందని కవిత గుర్తు చేశారు.

**ఖమ్మంలో పసిగుడ్డుకు న్యాయం చేయాలి**

ఖమ్మంలో ప్రభుత్వ హాస్పిటల్ లో వైద్యం చేయించుకోవటానికి తీసుకొచ్చిన ఓ పసిగుడ్డు చేయి తీసేయటంపై కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ హాస్పిటల్ లో డబ్బులు అయిపోతే ప్రభుత్వ హాస్పిటల్ లో వైద్యం చేయించేందుకు తీసుకొస్తే ఆ పసిగుడ్డు చేయి తీసేశారన్నారు. ఆ కుటుంబానికి ముఖ్యమంత్రి సహా ఖమ్మంలో ఉన్న మంత్రులు న్యాయం చేయాలన్నారు. ఆ చిన్నారి పేరు మీద రూ. 25 లక్షలు డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు.

# అది రైతులను చంపేసే డిస్కమ్!



ఈ కబురు, (హైదరాబాద్): నేతి బీరకాయలో నెయ్యి ఎంతుంటుందో రైతుల మీద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అంతే ప్రేమ ఉంటుందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. 24 గంటల కరెంటును ఎగ్గొట్టేందుకే ఇప్పుడు రైతు డిస్కమ్ అంటూ పాటపాడుతున్నాడని మండిపడ్డారు. సీఎం చెప్పే రైతు డిస్కమ్ రైతు మెడకు ఉరిపెట్టే డిస్కమ్ అని, అది రైతులను చంపేసే డిస్కమని ఘాటుగా విమర్శించారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని మిల్లీనియం గార్డెన్‌లో కంటోన్మెంట్ నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులకు ఎస్ఐఆర్, సభ్యత్వ నమోదు కార్యక్రమాలపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు.

ముఖ్యమంత్రి కాక ముందు రేవంత్‌రెడ్డి బయటి దేశానికి వెళ్లినపుడు రైతులకు 3 గంటలు కరెంటు ఇస్తే సరిపోతుందన్నారని, దాన్ని అమలు చేసేందుకు ఇప్పుడు రైతు డిస్కమ్ పాట అందుకున్నారన్నారు. రైతులకు ఇచ్చే రైతు బంధు రైతుల ఖాతాలో పడటం లేదు కానీ.. రాహుల్ బంధుకు మాత్రం నెలనెలా పడుతున్నాయని దుయ్యబట్టారు. రైతులకు ధాన్యం సంచులు ఇవ్వడం పట్టించుకోకున్నా, ఢిల్లీకి పంపే ధనం సంచుల మీద ముఖ్యమంత్రికి బాగా మోజుందని ధ్వజమెత్తారు.

**ఎన్నికల్లో పోటీ చేయబోమని ప్రకటించే ధైర్యముందా?**

కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 6 వేల ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారని, రెండేళ్లలో ఆరు ఇళ్లయినా కట్టించారా, కనీసం ఆరు ఇటుకలైనా పెట్టారా అని కేటీఆర్ ప్రశ్నించారు. దమ్ముంటే మీరిచ్చిన 420 హామీలు నెరవేరుస్తామని, లేకుంటే ఎన్నికల్లో పోటీ చేయమని ప్రకటించే ధైర్యం ముఖ్యమంత్రికి ఉందా అని నిలదీశారు. ముఖ్యమంత్రి చిన్న పిల్లల దగ్గరకు వెళ్లినా బూతు పురాణాలు మాట్లాడుతున్నారని, పేగులు మెడలో వేసుకుంటానని, గుడ్లు పీకుతానని, లాగులో తొండలు వేస్తానని అంటున్నారని మండిపడ్డారు.

అందుకే ఆయన తమ్ముడు కొండల్‌రెడ్డి లాగే ఈయనను తొండలరెడ్డి పేరుతో పిలవాలని ఎద్దేవా చేశారు. హామీలు నెరవేర్చమంటే కేసీఆర్ తెలంగాణను అప్పుల పాలు చేశాడని అంటున్నారని.. అదే నిజమని కానీ అప్పులు చేసి లక్ష డబుల్ బెడ్‌రూమ్‌లు నిర్మించారని, రైతుల ఖాతాల్లో రూ.73 వేల కోట్లు వేశారని, రెండుమార్లు రూ.30 వేల కోట్లతో రైతు రుణమాఫీ చేశాడని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం 60 ఏళ్లలో చేయలేనిది కేసీఆర్ 6 నెలల్లో లక్ష కోట్లు ఖర్చు పెట్టి విద్యుత్ వ్యవస్థను మార్చి 24 గంటలు కరెంటు ఇచ్చాడన్నారు.

కాంగ్రెస్ దరిద్రాన్ని దేశం మొత్తం వదిలించుకుందని కానీ తెలంగాణలో ప్రజలు నెత్తిన పెట్టుకున్నారని, దాన్ని ఇప్పుడు అనుభవిస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు జరగనున్న ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలని, బూత్‌స్థాయి నాయకులు బీఎల్‌వోలతో ఉంటూ అర్హులది ఒక్క ఓటు కూడా పోకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారుల జుగల్‌బందీ



ఈ కబురు,న్యూఢిల్లీ: భారత క్రీడాకారులు ప్రపంచ స్థాయిలో ప్రతిభా పాటవాలు చాటుతూ దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. అథ్లెటిక్స్ రంగంలో దేశ క్రీడాకారులు సాధించిన విజయాలను ప్రస్తావించారు. ఆదివారం 134వ మన్ కీ బాత్ ఎపిసోడ్‌లో ద్వారా దేశ ప్రజలనుద్దేశించి ఆయన రేడియోలో ప్రసంగించారు. ఈ సందర్భంగా భారత క్రీడాకారుల ప్రతిభను ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యంగా జార్ఖండ్‌లోని రాంచీలో జరిగిన జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ పోటీల్లో నాలుగు కొత్త జాతీయ రికార్డులు నెలకొల్పిన క్రీడాకారులపై ప్రశంసల వర్షం కురిపించారు. గురీందర్‌వీర్ సింగ్, విశాల్ టీకే, తేజస్విన్ శంకర్, దేవ్ మీనా, కులదీప్ కుమార్... ఈ స్నేహితులు వివిధ విభాగాలలో కొత్త రికార్డులు నెలకొల్పారని చెప్పారు. ముఖ్యంగా 100 మీటర్ల పరుగు పందెంలో రెండు రోజుల వ్యవధిలో పాత రికార్డులను మూడుసార్లు బద్ధలుకొట్టిన అనిమేశ్ కుజూర్, గురిందర్‌వీర్ సింగ్‌లతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. వీరిద్దరి పోటీని క్రీడల్లో 'జుగల్‌బందీ'గా అభివర్ణించారు.

భారతీయుల శరీరాకృతి స్ప్రింటింగ్‌కు పనికిరాదనే అపోహలను పటాపంచలు చేస్తూ 10.1 సెకన్లలోపు పరుగు పూర్తి చేసిన తొలి భారతీయుడిగా రికార్డు సృష్టించిన నావికాదళ అధికారి గురిందర్‌వీర్‌ను, ఫుట్‌బాల్ నుంచి అథ్లెటిక్స్‌లోకి వచ్చి రాణిస్తున్న అనిమేశ్‌ను ప్రధాని మోదీ అభినందించారు. మైదానం బయట స్నేహితులుగా, మైదానంలో పోటీదారులుగా ఉంటూ దేశ గౌరవాన్ని పెంచుతున్న వీరి క్రీడాస్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. 'మన్ కీ బాత్'లో ప్రధాని ఇంకా ఏం మాట్లాడారంటే...

**దేశీయ పానీయాలను ఆస్వాదించండి**

''దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎండల్లో డీహైడ్రేషన్‌కు గురికాకుండా తగినంత నీరు తాగాలి. బయటకు వెళ్లేటప్పుడు అదనపు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వం జారీ చేసే సలహాలు సూచనలు తప్పనిసరిగా పాటించాలి. వేసవి వేడిని తట్టుకునే అద్భుతమైన మార్గాలు మన వంటగదిలోనే ఉన్నాయి. ఉత్తర భారతదేశపు ఆమ్ పన్నా, పంజాబీ లస్సీ, రాజస్తానీ-గుజరాతీ మజ్జిగలతో పాటు బిహార్, జార్ఖండ్‌ల సత్తు షర్బత్, కొంకణ్ కోకుమ్ షర్బత్, దక్షిణ భారతదేశపు పానకం, నీర్ మోర్ వంటి సాంప్రదాయ పానీయాలు కేవలం దాహాన్ని తీర్చేవి మాత్రమే కావి.. అవి 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని ప్రతిబింబిస్తాయి. ప్రతి ఒక్కరూ ఈ దేశీయ పానీయాలను ఆస్వాదించాలి.

గ్లోబల్ మార్కెట్‌కు మన మామిడి

వేసవిలో వచ్చే ఫలరాజం మామిడి పండ్ల ప్రస్తావన రాని ఇల్లు ఉండదు. అల్ఫాన్సో, కేసర్, దశేరీ, లంగ్రా, చౌసా, మాల్డా వంటి మామిడి రకాలు మనకు ఉన్నాయి. ప్రతి పేరుతో ప్రజలకు ఎన్నో జ్ఞాపకాలు ముడిపడి ఉన్నాయి. దక్షిణ భారతదేశానికి వెళితే బంగినపల్లి, తోతాపురీ, నీలం, మాల్గోవా, సువర్ణ రేఖ వంటి రకాలు కనిపిస్తాయి. ప్రదేశం మారితే మామిడి పండు ఆకారం, రంగు, రుచీ మారుతాయి. మన మామిడి ప్రయాణం ఇప్పుడు గ్రామాల నుండి గ్లోబల్ మార్కెట్‌కు చేరుకుంటోంది. పడవ ప్రమాదంలో విద్యార్థులు చనిపోయిన ఘటనతో కలత చెంది, కేరళంలో ఉచితంగా 15 వేల మందికి పైగా ఈత నేర్పించిన సాజీ వలాశేరిల్ సేవలు నిజంగా ప్రశంసనీయం. దివ్యాంగ పిల్లలకూ ఈత నేర్పించారు. యూపీ కాలువలో చిక్కుకున్న గంగా డాల్ఫిన్‌ను 13 గంటల పాటు శ్రమించి కాపాడి రాప్తి నదిలోకి విడిచిపెట్టిన సిబ్బందిని అభినందిస్తున్నా.

**గిరిజా అమ్మ దేశభక్తికి సలాం**

తమిళనాడులోని నాగర్‌కోయిల్‌కు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయురాలు గిరిజా అమ్మ గొప్ప దేశభక్తికి ప్రతీక. 'మన్ కీ బాత్' స్ఫూర్తితో ఆమె పనిచేశారు. సైనికుల కోసం రోజుకు ఒక రూపాయి చొప్పున ఏడాదికి రూ.365 విరాళం ఇచ్చేలా తన పరిధిలోని 15 పాఠశాలల విద్యార్థులను ఆమె ప్రోత్సహించారు. అలా సేకరించిన రూ.40 లక్షల చెక్కును ఆమె నాకు అందజేశారు. ఉత్తరప్రదేశ్‌లోని బస్తీ జిల్లాలో మనోరమ నదిని శుభ్రం చేసిన యువకుడు ఆకాశ్ గుప్తా, గోవాలో పైప్‌లైన్లు వేసి నీటి సమస్యను పరిష్కరించిన తీర్చిన రిటైర్డ్ టీచర్ బాలకృష్ణ అయ్యర్ సేవలు అభినందనీయం'' అని అన్నారు.

# ప్రశ్నిస్తే అవమానిస్తున్నారు



ఈ కబురు,న్యూఢిల్లీ: సీబీఎస్ఈ ఓఎస్ఎం వివాదంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై మరోసారి విమర్శలు గుప్పించారు. ఇటీవల కొందరు విద్యార్థులతో సంభాషించిన వీడియోను ఆదివారం ఆయన షేర్ చేశారు. 'వీరంతా సీబీఎస్ఈలో అవకతవకలపై మోదీ ప్రభుత్వాన్ని చాలా చిన్న ప్రశ్నలు మాత్రమే అడిగారు. ప్రశ్నిస్తే వీళ్లను అవమానిస్తున్నారు. సమాధానాలకు బదులు వీళ్లకు అవమానాలే ఎదురయ్యాయి.

దేశ వ్యతిరేకులంటూ వారిపై ముద్ర వేశారు' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఈ దేశద్రోహులతో ఎంతో ఆసక్తికర సంభాషణ జరిగింది. వీరికి ఎంతో చక్కటి భవిష్యత్తుంది' అని అన్నారు. ఇటీవల సీబీఎస్ఈ అప్‌లోడ్ చేసిన 12వ తరగతి ఆన్సర్ షీట్ తమది కాదంటూ వేదాంత్ 'ఎక్స్'లో పోస్ట్ చేశాడు. అనంతరం మరికొందరు విద్యార్థులూ తమకూ ఇతరుల ప్రశ్నపత్రాలు ఇచ్చారంటూ ఆన్‌లైన్‌లో ప్రకటించడం తీవ్ర కలకలం రేగిన విషయం తెల్సిందే.

# స్వతంత్ర భారత దేశ చరిత్రలోనే అతిపెద్ద గృహ విప్లవం



ఈకబురు,హైదరాబాద్, మే 31:

ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పేదల సొంతింటి కలలను నెరవేర్చడానికి ఉచితంగా ఐదు లక్షల రూపాయిలతో భారీ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని అమలు చేస్తూ తెలంగాణ రాష్ట్రం దేశానికి మార్గదర్శకంగా నిలుస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో అమలు అవుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ఇప్పుడు కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాకుండా పేద కుటుంబాల జీవితాలను మార్చేస్తున్న సామాజిక ఉద్యమంగా మారిందని అన్నారు.స్వతంత్ర భారత చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సలహాలు సూచనల మేరకు భారీ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టి తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షలకు పైగా ఇండ్లను మంజూరు చేశామని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 1న ఆసిఫాబాద్ జిల్లా కరమెర మండలం కొఠారి గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రెండవ విడతకు శ్రీకారం చుట్టబోతున్నామని ప్రకటించారు. అలాగే కొత్తగూడలో సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్ల మంజూరుతో రెండు విడతల్లో కలిపి ఒక్కో నియోజకవర్గానికి 5500 నుంచి 6,500 ఇళ్లను మంజూరు చేసినట్లు అవుతుందన్నారు. ఐటిడిఎ ప్రాంతాల్లోని గిరిజన నియోజకవర్గాలకు అదనంగా 500 నుంచి 1500 వరకు మంజూరు చేశామని తెలిపారు. తాము ఆశించిన స్థాయిలో మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం విజయవంతమైందని గత ఏడాది ఫిబ్రవరి మూడవ వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నారాయణపేట జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారని, ఈ 13 నెలల్లో లక్ష ఇళ్లను పూర్తి చేసుకొని మరో ఒకటి రెండు నెలల్లో మరో రెండు లక్షల ఇళ్లు పూర్తికాబోతున్నాయని తెలిపారు. ఇది ఏరకంగా చూసినా దేశానికే ఆదర్శవంతంగా ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని అన్నారు. ఈ ఏడాది 202627 ఆర్థిక సంవత్సరానికి గాను క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లకు రాష్టం లోని ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షలు మొత్తం 3.50 లక్షల ఇళ్ల మంజూరుకు పరిపాలనా అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు.

ఒక ప్రణాళికా బద్ధంగా మొదటి విడతలో ఎదురైన మంచి చెడులను పరిగణనలో తీసుకొని మరింత పటిష్టంగా రెండోవిడత కార్యక్రమాన్ని అమలు చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. దేశంలోని చాలా రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పరిమిత నిధులతోనే గృహ నిర్మాణాలను కొనసాగిస్తున్నప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం మాత్రం పేదవాడి ఇల్లు - ప్రభుత్వ బాధ్యత అనే లక్ష్యంతో స్వంత నిధులతో ముందుకు సాగుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కేంద్రం కేవలం రూ.72 వేలే, పట్టణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు మాత్రమే ఇస్తున్నా, తెలంగాణ ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారునికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి 2013 వరకు అమలు చేసిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు మంజూరై, ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్న ఇండ్లను పూర్తి చేయడానికి, 2023 లో గృహ లక్ష్మి పథకంలో ఇండ్లు మంజూరై ఇప్పటికీ పూర్తి చేసుకోలేకపోయిన వారికి రెండవ విడతలో ఆ ఇంటి నిర్మాణం పూర్తి అవడానికి అవసరమయ్యే ఆర్థికసాయాన్ని అందిస్తామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో చేపట్టిన ఇందిరమ్మ పథకంలో 20వేల రూపాయిల వరకు ఆర్థికసాయం పొందినవారికి కూడా ఈ విడతలో ఇండ్ల మంజూరు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

# లెబనాన్ బ్యూఫోర్ట్ క్యాజిల్‌ను స్వాధీనం చేసుకొన్న ఇజ్రాయెల్..



ఈ కబురు; దక్షిణ లెబనాన్‌లోని బ్యూఫోర్ట్ క్యాజిల్‌ను ఇజ్రాయెల్‌కు చెందిన గోలానీ బ్రిగేడ్ దళాలు స్వాధీనం చేసుకొన్నాయి. దీనిపై ఇజ్రాయెల్ పతకాలను ఆ దళం ఎగురవేసింది. 1982 తొలి లెబనాన్ యుద్ధంలో ఇజ్రాయెల్ దళాలు ఈ కోటను మొదటిసారి స్వాధీనం చేసుకొన్నాయి. నాడు కూడా గోలానీ బ్రిగేడే పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్ దళాలతో పోరాడి.. ఈ కోటను ఆక్రమించాయి. నాటి నుంచి 2000 సంవత్సరం వరకు ఇది ఇజ్రాయెల్ అధీనంలోనే ఉంది.తాజాగా ఇజ్రాయెల్‌పై హమాస్ దళాలు భారీగా దాడులు చేసిన మర్నాడే తిరిగి ఈ కోటను ఐడీఎఫ్ స్వాధీనం చేసుకోవడం గమనార్హం. దక్షిణ లెబనాన్, ఉత్తర ఇజ్రాయెల్‌పై నిఘా పెట్టడానికి ఈ కోట అత్యంత వ్యూహాత్మక ప్రదేశం. ఈ ప్రాంతంలోని రాకెట్ లాంచింగ్ వ్యవస్థలపై తాము దృష్టి పెట్టబోతున్నట్లు ఇజ్రాయెల్ బలగాలు వెల్లడించాయి. "బ్యాటిల్ ఆఫ్ బ్యూఫోర్ట్ ముగిసిన 44 ఏళ్ల తర్వాత ఇజ్రాయెలీ దళాలు తిరిగి ఆ కోటపై పతకాలను ఎగురవేశాయి" అని ఆ దేశ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ప్రకటించారు. ఈ కోట స్వాధీనం చేసుకోవడానికి యుద్ధ విమానాల సాయంతో ఇజ్రాయెల్ దళాలు భారీ ఎత్తున బాంబింగ్ చేయడంతోపాటు భూతల పోరాటం కూడా చేశాయి.

# న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజీలో డాక్టర్ రెడ్డీస్ రజతోత్సవం

### న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజీలో సతీష్ రెడ్డి



హైదరాబాద్: ఫార్మా రంగంలోని డాక్టర్ రెడ్డీస్.. న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదై 25 ఏళ్లు పూర్తి చేసుకుంది. 2001 ఏప్రిల్‌లో ఈ ఎక్స్ఛేంజీలో నమోదైన తొలి జపానేతర ఆసియా ఫార్మా కంపెనీగా డాక్టర్ రెడ్డీస్ ఘనత సాధించింది. శుక్రవారం సంస్థ ఛైర్మన్ కె.సతీష్ రెడ్డి ముగింపు గంట మోగించి, వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ సీఈఓ ఎరెజ్ ఇజ్రాయెలీ, గ్లోబల్ జనరిక్స్ సీఈఓ ఎం.వి. రమణ, సీఎఫ్ఓ ఎం.వి.నరసింహం, నార్త్ అమెరికా సీఈఓ మిలన్ కలవాడియా, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజీలో 25 ఏళ్ల ప్రయాణం ఒక వార్షికోత్సవం కాదని, అంతర్జాతీయ స్థాయిలో కార్పొరేట్ గవర్నెన్స్, పారదర్శకత, ఆవిష్కరణల పట్ల తమకున్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. నాణ్యమైన ఉత్పత్తులు, స్థిరమైన కార్యకలాపాల ద్వారా నేడు అమెరికా మార్కెట్లో ఒక విశ్వసనీయమైన బ్రాండ్‌గా గుర్తింపు పొందినట్లు పేర్కొన్నారు.

## సైయెంట్ చేతికి టావో డిజిటల్




హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ఇంజినీరింగ్ సేవల సంస్థ టావో డిజిటల్‌ను సైయెంట్ లిమిటెడ్ కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. సుమారు రూ.2,070 కోట్ల (218 మిలియన్ డాలర్లు) ఎంటర్‌ప్రైజ్ విలువతో అమెరికా కేంద్రంగా ఉన్న టావో డిజిటల్‌కు చెందిన 100% వాటా సైయెంట్ చేతికి రానుంది. దీనికి సంబంధించి ఇరు సంస్థలూ ఒప్పందం కుదుర్చుకున్నట్లు సైయెంట్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. సంబంధిత నియంత్రణ అనుమతులు పూర్తి చేసుకున్న తర్వాత, ఈ కొనుగోలు ప్రక్రియ ఈ ఏడాది సెప్టెంబరు నాటికి పూర్తవుతుందని కంపెనీ అంచనా వేస్తోంది. ఈ ఒప్పందంతో సైయెంట్ తన వినియోగదారులకు 'ఏఐనేటివ్ డేటా', 'డిజిటల్ ప్రోడక్ట్ ఇంజినీరింగ్' సేవలను అత్యుత్తమ స్థాయిలో అందించనుంది. తమ మూడు దశాబ్దాల అనుభవానికి, టావో డిజిటల్ ఏఐ నైపుణ్యం తోడవడం ద్వారా ఆటోమోటివ్, హైటెక్, హెల్త్‌టెక్ రంగాల్లో సంస్థ ఉనికి బలోపేతం అవుతుందని సైయెంట్ సీఈఓ సుకమల్ బెనర్జీ పేర్కొన్నారు. సైయెంట్‌తో కలిసి మరింత మెరుగైన సేవలను అందిస్తామని టావో సీఈఓ రాజ్‌కుమార్ వెలగపూడి తెలిపారు.

## చేతులు కలిపిన...
## హెచ్‌డీఎఫ్‌సీ క్యాపిటల్, జపాన్ బ్యాంకు




న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా మధ్యాదాయ, అందుబాటు ధరల గృహ సముదాయ ప్రాజెక్టులలో ఇన్వెస్ట్ చేసేందుకు తాజాగా హెచ్‌డీఎఫ్‌సీ క్యాపిటల్‌తో డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ జపాన్ (డీబీజే) చేతులు కలిపింది. ఇందుకు అనుగుణంగా రియల్టీ ఫండ్‌ను ఏర్పాటు చేయనున్నాయి. మొత్తం బిలియన్ డాలర్ల (సుమారు రూ. 9,500 కోట్లు) మూలధన లక్ష్యంతో ఫండ్‌కు తెరతీయనున్నాయి.దీంతో డీబీజే తొలిసారి దేశీయంగా రియల్టీ రంగంలో పెట్టుబడులు చేపట్టనున్నట్లు హెచ్‌డీఎఫ్‌సీ క్యాపిటల్ పేర్కొంది. అయితే పెట్టుబడి వివరాలు వెల్లడించలేదు. హెచ్‌డీఎఫ్‌సీ క్యాపిటల్ డెవలప్‌మెంట్ రియల్టీ చౌక, మధ్యాదాయ (హెచ్ -డీఆర్ఈఏఎం (డ్రీమ్) ఫండ్ పేరుతో ఏర్పాటు చేయనున్న నిధిని హెచ్‌డీఎఫ్‌సీ క్యాపిటల్ అడ్వయిజర్స్ నిర్వహించనున్నట్లు తెలియజేసింది.50 కోట్ల డాలర్ల కార్పస్ లక్ష్యానికి మరో 50 కోట్ల డాలర్లు గ్రీన్‌షూ ఆప్షన్‌తో ఫండ్‌ను నెలకొల్పనున్నట్లు తెలియజేసింది. 35 కోట్ల డాలర్లమేర పెట్టుబడులకు ప్రస్తుత ఇన్వెస్టర్లు కట్టుబాటు చూపనున్నట్లు వివరించింది. హెచ్‌డ్రీమ్ ఫండ్ హెచ్‌డీఎఫ్‌సీ క్యాపిటల్‌లో యాంకర్ ఇన్వెస్టర్‌గా ఐఎఫ్‌సీ 15 కోట్ల డాలర్ల పెట్టుబడులకు గతేడాది ఆగస్ట్‌లో కట్టుబాటును ప్రదర్శించినట్లు ప్రస్తావించింది.

## ఆప్టిమిస్ట్ నుంచి స్మార్ట్ ఏసీ

హైదరాబాద్: దేశీ క్లైమేట్ -టెక్ బ్రాండ్ ఆప్టిమిస్ట్ ఎయిర్ కండీషనింగ్ మార్కెట్లోకి ప్రవేశించింది. 50 డిగ్రీల ఉష్ణోగ్రతల్లోనూ సమర్థవంతంగా పని చేసే స్మార్ట్ ఏసీలను ఆవిష్కరించింది. ప్రారంభ ఆఫర్ కింద 1.4 టన్నుల 5 స్టార్ ఇన్వర్టర్ స్ప్లిట్ ఏసీలపై ఎంఆర్‌పీ మీద 38 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు, రూ. 39,990కే అందిస్తున్నట్లు సంస్థ సహ వ్యవస్థాపకులు, సీఈవో ఆశీష్ గోయల్ తెలిపారు. రాబోయే రోజుల్లో 1 టన్, 2 టన్ వేరియంట్లను కూడా ప్రవేశపెట్టనున్నట్లు ఆయన వివరించారు. తమ ఆఫ్‌లైన్ స్టోర్స్‌తో పాటు ఆన్‌లైన్‌లో అమెజాన్, ఆప్టిమిస్ట్ పోర్టల్స్‌లో కూడా ఇవి లభిస్తాయని పేర్కొన్నారు.ఆప్టిమిస్ట్ సంస్థను అర్బన్ ల్యాడర్ మాజీ సహ వ్యవస్థాపకుడు ఆశీష్ గోయల్, ప్రణవ్ చోప్రా కలిసి 2024లో స్థాపించారు. భారత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా ఏసీలను అభివృద్ధి చేస్తున్న ఈ స్టార్టప్ ఇటీవలే యాక్సెల్, అర్కామ్ వెంచర్స్ తదితర ఇన్వెస్టర్ల నుంచి 12 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించింది. ఐఐటీ ఢిల్లీతో కలిసి థర్మల్ ఇంజినీరింగ్, ప్రొడక్ట్ వాలిడేషన్‌పై పని చేసిన సంస్థ, విద్యుత్ వినియోగాన్ని తగ్గించే అధిక సామర్థ్య సాంకేతికతతో పాటు స్మార్ట్ యాప్ ఆధారిత మానిటరింగ్, గ్యాస్ లెవల్ ఇండికేటర్ వంటి ఫీచర్లను కూడా అందిస్తున్నట్లు తెలిపింది.

# స్టాక్ మార్కెట్ అలర్ట్.. ట్రేడింగ్ సమయంలో మార్పు



డెరివేటివ్స్ (ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్-ఎఫ్అండ్ఓ) విభాగంలో ట్రేడింగ్ సమయాలను పొడిగిస్తున్నట్లు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) ప్రకటించింది. కొత్త షెడ్యూల్ ప్రకారం 2026 ఆగస్టు 3 నుంచి ఈక్విటీ డెరివేటివ్స్ సెగ్మెంట్‌లో సాధారణ ట్రేడింగ్ ముగింపు సమయం మధ్యాహ్నం 3:30 గంటల నుంచి 3:40 గంటలకు మారనుంది. ప్రీఓపెన్ సెషన్, మార్కెట్ ప్రారంభ సమయాల్లో మాత్రం ఎలాంటి మార్పు ఉండదు.క్యాష్ మార్కెట్‌లో ప్రవేశపెట్టనున్న 'క్లోజింగ్ ఆక్షన్ సెషన్' (CAS)తో డెరివేటివ్స్ ట్రేడింగ్ సమయాలను సమలేఖనం చేయడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశమని ఎన్ఎస్ఈ వెల్లడించింది. కొత్త విధానంలో క్యాష్ మార్కెట్‌లో మధ్యాహ్నం 3:15 నుంచి 3:35 గంటల వరకు క్లోజింగ్ ఆక్షన్ నిర్వహించి, ఆ రోజు అధికారిక ముగింపు ధర (Closing Price)ను నిర్ణయించనున్నారు.

**--ట్రేడర్లకు మరింత వెసులుబాటు**

క్లోజింగ్ ఆక్షన్ సమయంలో ఏర్పడే ధరల మార్పులను దృష్టిలో ఉంచుకుని, ఎఫ్అండ్ఓ ట్రేడర్లు తమ పొజిషన్లను హెడ్జ్ చేసుకోవడానికి, సర్దుబాటు చేసుకోవడానికి లేదా ఎగ్జిట్ కావడానికి అదనంగా 10 నిమిషాల సమయం లభిస్తుంది. దీంతో క్యాష్, డెరివేటివ్స్ మార్కెట్ల మధ్య ముగింపు సమయాల్లో ఉండే వ్యత్యాసం తగ్గి, ధరల ఆవిష్కరణ మరింత సమర్థవంతంగా జరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

**--మారని అంశాలు ఇవే...**

ప్రీఓపెన్ సెషన్ ఉదయం 9 గంటలకే ప్రారంభం. రెగ్యులర్ మార్కెట్ ప్రారంభ సమయం యథాతథం. ట్రేడ్ మాడిఫికేషన్ సౌకర్యం సాయంత్రం 4:15 గంటల వరకు కొనసాగుతుంది.ఎఫ్అండ్ఓ క్లోజింగ్ ధరల లెక్కింపునకు ఉపయోగించే VWAP విండోను 3:10-3:40 గంటల మధ్య ట్రేడింగ్‌కు అనుగుణంగా సవరించనున్నారు.

**--ఇటీవలి కీలక మార్పులు**

గత కొంతకాలంగా డెరివేటివ్స్ మార్కెట్‌లో ఎన్ఎస్ఈ పలు సంస్కరణలను అమలు చేస్తోంది. 2025 చివర్లో ఎఫ్అండ్ఓ విభాగంలో ప్రీఓపెన్ సెషన్‌ను ప్రవేశపెట్టగా, ఇప్పుడు క్లోజింగ్ ఆక్షన్ వ్యవస్థకు అనుగుణంగా ట్రేడింగ్ సమయాన్ని కూడా పొడిగిస్తోంది. మార్కెట్ పారదర్శకత, మెరుగైన ధరల నిర్ణయం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వ్యవస్థను తీర్చిదిద్దడమే ఈ మార్పుల లక్ష్యంగా పేర్కొంటున్నారు.

# ఫిన్‌టెక్ రంగంలోకి ఎల్ఐసీ: సీఈఓ దొరైస్వామి




దిల్లీ: ప్రభుత్వరంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (LIC) ఫిన్‌టెక్ రంగంలోకి ప్రవేశించాలనుకుంటోంది. డిజిటల్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో వ్యూహాత్మక పెట్టుబడులు లేదా ఆర్గానిక్ మార్గంలో ఫిన్‌టెక్ విభాగాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కంపెనీ సీఈఓ, ఎండీ ఆర్ దొరైస్వామి తెలిపారు. ఆధునిక అవసరాలను తీర్చడానికి, నూతన ఆవిష్కరణల కోసం అటు ఫిన్‌టెక్, ఇటు ఇన్సురెన్స్‌టెక్ కంపెనీలతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశలపై మాట్లాడారు.కేవలం బీమా వ్యాపారమే కాకుండా దేశంలోనే అతిపెద్ద ఆర్థిక సంస్థగా ఎల్ఐసీ ఉందని, అనేక పెద్ద పెద్ద కంపెనీల్లో ఇప్పటికే పెట్టుబడులు పెట్టిందన్నారు. పాలసీదారులకు మెరుగైన ప్రతిఫలం అందించేందుకు ప్రత్యేకమైన సంస్థల్లో వ్యూహాత్మక పెట్టుబడులకూ ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. డిజిటల్ టెక్నాలజీని ఎల్ఐసీ వేగంగా అందిపుచ్చుకుంటోందని చెప్పారు. తమ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా సొంతంగానే తమ బిజినెస్ అప్లికేషన్లను తయారు చేసుకుంటున్నామని వెల్లడించారు. అదే సమయంలో కొత్త కొత్త ప్లాట్‌ఫామ్‌లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం ఇతర ఐటీ సర్వీస్ ప్రొవైడర్లతోనూ కలిసి పనిచేస్తున్నామని చెప్పారు. ఫిన్‌టెక్ రంగంలో పోటీలో నిలదొక్కుకోవాలంటే ఐటీ అప్లికేషన్లను ఆధునీకీకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్ఐసీలో తదుపరి వాటాల విక్రయంపై ప్రశ్నించగా.. పబ్లిక్ షేర్‌హోల్డింగ్ పరిమితిని పెంచేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని చెప్పారు.

# గూగుల్‌కు రూ.30 లక్షల జరిమానా!




డిజిటల్ ప్రకటనల రంగంలో ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకున్న ఒక కేసులో ఢిల్లీ హైకోర్టు, గూగుల్‌పై కీలకమైన తీర్పును వెల్లడించింది. ప్రముఖ బాత్‌రూమ్ ఫిట్టింగ్స్ అండ్ శానిటరీ వేర్ తయారీ సంస్థ 'హింద్‌వేర్' ట్రేడ్‌మార్క్ హక్కులను ఉల్లంఘించిందని గుర్తించిన కోర్టు, గూగుల్‌కు రూ.30 లక్షల జరిమానా విధించింది.హింద్‌వేర్ అనేది భారతదేశంలో ప్రసిద్ధి చెందిన శానిటరీ వేర్ బ్రాండ్. వినియోగదారులు గూగుల్‌లో Hindware అని వెతికినప్పుడు, హింద్‌వేర్ వెబ్‌సైట్‌కు బదులుగా ప్రత్యర్థి కంపెనీల ప్రకటనలు ముందుగా కనిపిస్తున్నాయని సంస్థ గుర్తించింది. దీనికి కారణం.. ఆ కంపెనీలు హింద్‌వేర్ అనే పదాన్ని తమ ప్రకటనల కోసం కీవర్డ్‌గా కొనుగోలు చేయడమే.గూగుల్ యొక్క AdWords (ప్రస్తుతం గూగుల్ యాడ్స్) వ్యవస్థలో కంపెనీలు తమకు కావలసిన కీవర్డ్లపై బిడ్ వేస్తాయి. వినియోగదారులు ఆ పదాలను సెర్చ్ చేసినప్పుడు, ఎక్కువ బిడ్ వేసిన కంపెనీల ప్రకటనలు పైభాగంలో కనిపిస్తాయి. ఈ విధంగా హింద్‌వేర్ పేరును ప్రత్యర్థులు ఉపయోగించుకోవడం వల్ల వినియోగదారులు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉందని కంపెనీ వాదించింది.

**163 పేజీల తీర్పు**

ఈ కేసును విచారించిన న్యాయమూర్తి.. గూగుల్ కేవలం ఒక మధ్యవర్తి కాదని స్పష్టం చేశారు. గూగుల్ స్వయంగా కీవర్డ్లను సూచించడం, వాటి వేలాన్ని నిర్వహించడం, ప్రకటనల ప్రదర్శనను తన అల్గోరిథమ్‌ల ద్వారా నియంత్రించడం వంటి చర్యలు చేపడుతోంది. కాబట్టి ట్రేడ్‌మార్క్‌ను వ్యాపార ప్రయోజనాల కోసం ప్రదర్శించాల్సిన బాధ్యత గూగుల్‌పైనా ఉంటుందని కోర్టు తన 163 పేజీల తీర్పులో పేర్కొంది.

**కోర్టు అభిప్రాయం ప్రకారం..** హింద్‌వేర్ అనే ట్రేడ్‌మార్క్‌పై గూగుల్‌కు ఎటువంటి యాజమాన్య హక్కు లేదు. అయినప్పటికీ.. ఆ పేరును ప్రత్యర్థి సంస్థలకు అమ్మి లాభం పొందడం ద్వారా గూగుల్ ఆ కంపెనీ ప్రతిష్ఠను వాణిజ్యపరంగా వినియోగించుకుంది. దీనిని కోర్టు ఫ్రీ రైడింగ్ (ఇతరుల కృషి వల్ల ఏర్పడిన పేరును ఉపయోగించి లాభపడటం) అని వెల్లడించింది.

**గూగుల్ వాదన**

గూగుల్ తనను తాను కేవలం ప్రకటనల వేదికగా మాత్రమే పేర్కొంటూ.. హింద్‌వేర్ సమస్యకు తాము బాధ్యులు కాదని వాదించింది. కీవర్డ్స్ అనేవి వినియోగదారుడు సెర్చ్ చేసినప్పుడు.. ప్రకటనలు చూపించడానికి బ్యాక్ ఎండ్‌లో పనిచేసే కొన్ని సాధనాలు మాత్రమే అని వెల్లడించింది. అంతేకాకుండా.. సమాచార సాంకేతిక చట్టం, 2000లోని సెక్షన్ 79 ప్రకారం తమకు సేఫ్ హార్బర్ రక్షణ వర్తిస్తుందని తెలిపింది. అయితే కోర్టు ఈ వాదనను తిరస్కరించింది.

**ఎందుకంటే..** గూగుల్ కేవలం ప్రకటనలను ప్రదర్శించడం మాత్రమే కాకుండా, ట్రేడ్‌మార్క్‌లను కీవర్డ్లుగా అమ్మి ఆదాయం పొందుతోందని గుర్తించింది. అందువల్ల గూగుల్ ఒక క్రియాశీల పాత్ర పోషిస్తోందని, సేఫ్ హార్బర్ రక్షణకు అర్హత లేదని తీర్పు చెప్పింది.

**ప్రత్యర్థి సంస్థలు**

ఈ కేసులో ప్రత్యర్థి సంస్థలుగా గ్రోహే ఇండియా, ఓంకార ఇన్ఫోవెబ్, సెరా శానిటరీవేర్ కూడా ఉన్నారు. వీరు హింద్‌వేర్ పేరును లేదా హింద్‌వేర్ శానిటరీవేర్ వంటి పదాలను కీవర్డ్లుగా కొనుగోలు చేసి తమ ప్రకటనలను ప్రదర్శించారు. అయితే విచారణ సమయంలో ఈ సంస్థలు హింద్వేర్‌తో రాజీ చేసుకోవడంతో, చివరకు గూగుల్ మాత్రమే ఈ కేసులో మిగిలింది.ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు భారతదేశంలోని డిజిటల్ మార్కెటింగ్ రంగానికి ఒక మైలురాయిగా నిలిచింది. ఇప్పటి వరకు అనేక కంపెనీలు ప్రత్యర్థి బ్రాండ్ల పేర్లను కీవర్డ్లుగా కొనుగోలు చేసి తమ వ్యాపారాలను ప్రోత్సహించేవి. ఇకపై అలాంటి చర్యలు ట్రేడ్‌మార్క్ ఉల్లంఘనగా పరిగణించబడే అవకాశం ఉంది. నితిన్ కామత్ కూడా ఈ తీర్పును స్వాగతిస్తూ, తమ సంస్థకు ఇలాంటి సమస్యలు సంవత్సరాలుగా ఎదురవుతున్నాయని, ఇప్పుడు చట్టపరమైన పరిష్కారం పొందేందుకు మార్గం ఏర్పడిందని పేర్కొన్నారు.



## హైదరాబాద్‌లో డిజిలాజిక్ ప్లాంటు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెస్టింగ్, సిమ్యులేషన్స్ సేవలందించే హైదరాబాద్ సంస్థ డిజిలాజిక్ సిస్టమ్స్ గత ఆర్థిక సంవత్సరంలో (2025-26)లో రూ. 78.27 కోట్ల ఆదాయం ఆర్జించింది. రూ. 10.43 కోట్ల నికర లాభం ప్రకటించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ. 72.19 కోట్లు కాగా, లాభం సుమారు 7.79 కోట్లుగా నమోదైంది. జనవరిలో బీఎస్ఈ ఎస్ఎంఈలో లిస్టయిన డిజిలాజిక్.. సుమారు రూ. 70 కోట్లు సమీకరించింది. హైదరాబాద్‌లోని టీజీఐఐసీ హార్డ్‌వేర్ పార్క్ ఫేజ్ 2లో ఈఎంఎస్ తయారీ, ఈఎస్ఎస్ స్క్రీనింగ్ మొదలైన వాటికి సంబంధించి రూ. 52 కోట్లతో ప్రాజెక్ట్ ఉడాన్ పేరిట ప్లాంటు ఏర్పాటు చేస్తోంది. ఇది 2027 మే నాటికి అందుబాటులోకి రానుంది. అలాగే, డిఫెన్స్, ఏరోస్పేస్ సంబంధ కార్యకలాపాల విస్తరణ కోసం అభేద్య సిస్టమ్స్‌ను ఏర్పాటు చేసినట్లు సంస్థ తెలిపింది.

ప్రస్తుతం రూ. 31 కోట్ల విలువ చేసే ఆర్డర్లు ఉండగా, రూ. 110 కోట్ల టెండర్లకు కోట్ చేసినట్లు కంపెనీ సీఈవో శశాంక్ వర్మ జెట్టి తెలిపారు.

## 'బంగారం, వెండి.. అలా కొన్నారంటే నష్టమే'



ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా అమ్ముడైన 'రిచ్ డాడ్ పూర్ డాడ్' పుస్తక రచయిత రాబర్ట్ కియోసాకి అమెరికా ప్రభుత్వ బాండ్ల భద్రతపై సందేహాలు వ్యక్తం చేశారు.

ఆర్థిక ప్రణాళికకర్తలు అమెరికా బాండ్లు సురక్షితమైన పెట్టుబడులని చెబుతున్నప్పటికీ, అలాంటి అభిప్రాయాలను గుడ్డిగా నమ్మవద్దని ఆయన సూచించారు.సోషల్ మీడియా వేదికగా చేసిన పోస్టులో, "మూర్ఖత్వం నుంచి వచ్చే ఏ పెట్టుబడీ పూర్తిగా సురక్షితం కాదు" అని వ్యాఖ్యానించారు. బంగారం, వెండి, బిట్‌కాయిన్ వంటి ఆస్తులు కూడా కేవలం ప్రచారం లేదా హైప్ ఆధారంగా కొనుగోలు చేస్తే నష్టాలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు.ప్రస్తుతం జపాన్, చైనా వంటి ప్రధాన అమెరికా బాండ్ హోల్డర్లు తమ వద్ద ఉన్న బాండ్లను విక్రయించి బంగారం, వెండి కొనుగోలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మార్కెట్లలో నగదు ప్రవాహం ఏ దిశగా వెళ్తుందో గమనించడం మదుపరులకు ముఖ్యమని సూచించారు.అంతేకాకుండా, ఎవరికైనా అత్యంత విలువైన ఆస్తి వారి మెదడేనని, సరైన అవగాహనతో నిర్ణయాలు తీసుకోవాలని కియోసాకి అభిప్రాయపడ్డారు. పెట్టుబడులు పెట్టే ముందు మార్కెట్ పరిస్థితులను జాగ్రత్తగా విశ్లేషించాలని ఆయన సూచించారు.



# వాళ్ళకు కావల్సింది వసూళ్లు కాదు

ప్రేక్షకులు విభిన్న పాత్రల్లో మిమ్మల్ని గుర్తుంచుకున్నప్పుడు.. వారికి మీ సినిమా వసూళ్ల గురించి అవసరం లేదని అంటోంది కథానాయిక అదా శర్మ. 'ది కేరళ స్టోరి', 'బస్తర్' లాంటి వైవిధ్యమైన చిత్రాలతో తనేంటో నిరూపించుకున్న నాయికీమే. ప్రస్తుతం మనోజ్ బాజ్‌పేయితో కలిసి 'గవర్నర్' సినిమాలో నటిస్తోంది. ఈ చిత్రం ఈ నెల 12న థియేటర్లలోకి రాబోతుంది. ఈ నేపథ్యంలోనే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అదా.. తన సినీ ప్రయాణం, బాక్సాఫీస్ వసూళ్ల గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది.

"ఈరోజుల్లో బాక్సాఫీస్ వసూళ్లే ప్రధాన అంశంగా మారాయి. కానీ నా దృష్టిలో విజయానికి అర్థం వేరే ఉంది. ప్రేక్షకులు మీ దగ్గరకు వచ్చి.. 'హాయ్ మీ సినిమా రూ.375కోట్లు వసూలు చేసింది. నాకు నచ్చింద''ని చెప్పడానికి బదులుగా "ఆ సన్నివేశంలో మీరు ఏడుస్తున్నప్పుడు నేను కూడా ఏడ్చాను', 'మిమ్మల్ని ఆ పాత్రలో చూసి నాకు చాలా భయం వేసింది'' లాంటి మాటలు చెప్తే మీ కష్టానికి ఫలితం దక్కినట్లే. ఇలాంటి మాటలే నాకు అతి పెద్ద ప్రశంస. వసూళ్ల గురించి వాళ్లకు అవసరం లేదు. మీ నటనను మాత్రమే తమతో పాటు తీసుకెళ్తున్నారని నటీనటులు తెలుసుకోవాలి. బాక్సాఫీస్ అనేది సమయం, మార్కెటింగ్, ట్రెండ్‌లు, వాతావరణం లాంటి అనేక అంశాలతో ప్రభావితమవుతుంది. కానీ ఒక నటుడిగా మీరు ఒక సన్నివేశంలో ఎంత నిజాయతీగా ఉన్నారనేదే చాలా ముఖ్యం''.

–నమ్మితే చాలు.. చేసేస్తా

"నా సినీ ప్రయాణం మొదలై రెండు దశాబ్దాలు దగ్గరికి వస్తుంది. ఇప్పటి వరకు నేను చాలా విభిన్నమైన పాత్రలను పోషించాను. ఒక అమాయక విద్యార్థి నుంచి హంతకురాలు ఇలా ఎన్నో వైవిధమైన పాత్రల్లో నటించాను. అది హంతకుడైనా, పోలీసు అయినా. నేను ఆ పాత్రని మనస్ఫూర్తిగా నమ్మితే చాలు చేసేస్తా. ఈ పాత్ర సమాజాన్ని మారుస్తుంది. ఇది అవార్డులు గెలుస్తుంది. ఇది ఇన్‌స్టాగ్రామ్‌లో ట్రెండ్ అవుతుందని నేను నోట్ బుక్ పట్టుకొని ఆలోచించను. నా వరకు ఆ పాత్ర నన్ను కొంచెమైనా మారుస్తుందా లేదా అనే దానితోనే పాత్రల్ని ఎంచుకోవడం ప్రారంభిస్తాను''.

–చర్చలు ఇంకా ఆగలేదు

"కాలం గడిచిపోయింది కానీ 'ది కేరళ స్టోరీ' సినిమాపై చర్చలు మాత్రం ఆగలేదు. ఈ సినిమా విడుదలై మూడేళ్లు గడుస్తున్నా.. ప్రేక్షకులు సోషల్ మీడియాలో ఇప్పటికీ రీల్స్ చేస్తూ.. సినిమాలోని సన్నివేశాల గురించి మాట్లాడుకుంటున్నారు. ఒక రకంగా చెప్పాలంటే డబ్బు తీసుకుని ప్రచారం చేసే పీఆర్ బృందం కంటే ఎక్కువగా ప్రేక్షకులే ఈ సినిమాను ప్రచారం చేశారు. నా అభిప్రాయం ప్రకారం ఒక సినిమా విజయం సాధించినా.. సాధించకపోయినా మీరు మీ వృత్తిలో నిజాయతీగా ఉండాలి''.

# ఎప్పటికీ మీరే నా హీరో: మహేశ్‌బాబు పోస్టు

తన తండ్రి, నటుడు దివంగత కృష్ణ జయంతి సందర్భంగా మహేశ్‌బాబు ఎమోషనల్ పోస్టు పెట్టారు. 'ఎప్పటికీ మీరే నా హీరో. హ్యాపీ బర్త్ డే నాన్నా' అంటూ తండ్రిపై ప్రేమను వ్యక్తం చేశారు. మహేశ్ సతీమణి నమ్రతా శిరోద్కర్ కూడా కృష్ణను స్మరించుకున్నారు. ఎప్పుడూ ప్రేమతో మిమ్మల్ని తలచుకుంటూనే ఉంటామంటూ పోస్టు చేశారు.కృష్ణను స్మరించుకుంటూ.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ట్వీట్ చేశారు. "తెలుగు సినీ పరిశ్రమకు నటుడిగా, దర్శకుడిగా, సాహసోపేత నిర్మాతగా విశిష్ట సేవలందించిన పద్మభూషణ్ కృష్ణ గారి జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటున్నా. నూతన సాంకేతికతలను పరిచయం చేస్తూ సినీ రంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన ఆయన సేవలు చిరస్మరణీయం. అభిమానుల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించిన ఆ మహానటుడికి ఘన నివాళులు'' అని పేర్కొన్నారు.



# సైన్స్ ఫిక్షన్ మూవీ.. శోభిత లుక్ ఇలా



హీరోయిన్ శోభిత..
నాగచైతన్యని పెళ్లి చేసుకున్న తర్వాత సినిమాలు చేయడం మానేస్తుందేమోనని అంతా అనుకున్నారు. కానీ అలాంటిదేం జరగలేదు. కాకపోతే ఈమె నటించిన 'చీకటిలో' మూవీ నేరుగా ఓటీటీలో రిలీజైంది. కానీ పెద్దగా ఆకట్టుకోలేదు. వివాహం తర్వాత చాలా గ్యాప్ తీసుకుని థియేటర్లలోకి వచ్చేందుకు సిద్ధమైంది. ఈమె పుట్టినరోజు సందర్భంగా ఆ చిత్ర ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు.

శోభిత తెలుగమ్మాయి అయినప్పటికీ హిందీ సినిమాలతో కెరీర్ మొదలుపెట్టింది. తర్వాత తెలుగు, తమిళ, మలయాళంలోనూ పలు చిత్రాలు చేసింది. ప్రస్తుతం తమిళ స్టార్ డైరెక్టర్ పా. రంజిత్ తీస్తున్న 'వెట్టువం' అనే సైన్స్ ఫిక్షన్ మూవీలో హీరోయిన్‌గా చేస్తోంది. ఈ చిత్రంలో శోభిత లుక్ ఎలా ఉండబోతుందో ఇప్పుడు ఫొటో రిలీజ్ చేశారు. బ్లాక్ అండ్ బ్లాక్ డ్రస్‌లో పవర్‌ఫుల్‌గా కనిపించింది.



# తదుపరి ఆ దర్శకుడితోనే..

కథానాయకుడు రవితేజ 'ఇరుముడి' సినిమా ముగింపు దశకు చేరుకుంటోంది. ఈ నేపథ్యంలోనే ఆయన తదుపరి చిత్రాలపై దృష్టి సారించారు. ఇప్పటికే యువ దర్శకులు హసిత్ గోలి, వివేక్ ఆత్రేయ కథలు వినిపించి.. ఒప్పించినట్లు తెలిసింది. అయితే వీటిలో తొలుత పట్టాలెక్కేది వివేక్ చిత్రమని సమాచారం. దీన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనుంది. ప్రస్తుతం రవితేజ చేస్తున్న సినిమా పూర్తి కాగానే.. ఈ కొత్త చిత్రం సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇక రవితేజ హసిత్ గోలిల ప్రాజెక్ట్ వచ్చే ఏడాది ప్రథమార్థంలో చిత్రీకరణ ప్రారంభించుకునే అవకాశముంది. దీన్ని శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మించనున్నట్లు తెలుస్తోంది.



# బాబోయ్ ఏదో అయిపోయింది!



ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు నుంచి వస్తున్న కొత్త ప్రయోగాత్మక చిత్రం 'సింగ్ గీతం'. వైజయంతి మూవీస్ పతాకంపై దర్శకుడు నాగ్ అశ్విన్ నిర్మించిన సినిమా ఇది. అయాన్, అహల్య, శాలిని ప్రధాన పాత్రధారులుగా నటించారు. ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ఈ సినిమాలోని "ఏమైంది ఏమైంది.. బాబోయ్ ఏదో అయిపోయింది'' అనే గీతాన్ని నటి శ్రుతిహాసన్ ఇటీవల విడుదల చేశారు. ఇది ఓ గ్రామంలోని ప్రజలకు ఎదురైన వింత సమస్య చుట్టూ తిరిగే పాట. కొన్ని అనూహ్యమైన పరిణామాల తర్వాత ఆ ఊరి వాసుల సాధారణ మాటలన్నీ పాటలుగా మారిపోతాయి. ఈ నేపథ్యంలో ఆ గ్రామస్థుల గందరగోళాన్ని.. తమ వింత పరిస్థితికి సమాధానం వెతికే ప్రయత్నాల్ని ఈ పాటలో వినోదాత్మకంగా ఆవిష్కరించారు. దీనికి దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు సమకూర్చడమే గాక శ్రీమణి, గౌతమి చల్లగుల్ల రత్న శ్రీకర్, శశాంక్ చింతలపూడితో కలిసి సాహిత్యమందించారు. దీన్ని ఈ సినిమాలోని ముఖ్య తారాగణమే స్వయంగా ఆలపించడం విశేషం. ప్రస్తుతం ఈ చిత్ర నిర్మాణానంతర పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. త్వరలోనే ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు.

# త్వరలో సెట్స్ పైకి చియాన్ 63

ప్రయోగాత్మక పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుంటారు అగ్రహీరో విక్రమ్. గతేడాది 'వీర ధీర శూర' సినిమాతో అలరించిన ఆయన.. ఈ ఏడాది వరుస ప్రాజెక్టులతో తెరపై సందడి చేయడానికి సన్నద్ధమవుతున్నారు. దర్శకుడు ఆనంద్ శంకర్ తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో విక్రమ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నట్లు ఇటీవలే అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. 'చియాన్ 63' (వర్కింగ్ టైటిల్) అనే పేరుతో రాబోతున్న ఈ సినిమా గురించి ఇప్పుడొక ఆసక్తికర విషయం నెట్టింట్లో చక్కర్లు కొడుతుంది. ఈ చిత్ర షూటింగ్‌ను ఈ నెల 7నుంచి మొదలు పెట్టనున్నట్లు సమాచారం. యాక్షన్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ సినిమాని సత్యజ్యోతి ఫిల్మ్స్ నిర్మిస్తుంది. 'సర్వంమాయ' ఫేమ్ రియా శిబు ఇందులో కథానాయికగా నటిస్తుంది.






## ఆర్సీబీ 2.0.. గత విజయం గాలివాటం కాదని నిరూపించిన బెంగళూరు

''ఈ సల కప్ నమ్‌దే'' అన్న నినాదం కాల క్రమంలో కామెడీగా మారిపోయి ఎంతో వేదనను అనుభవించిన ఆర్సీబీ ఫ్యాన్స్.. వరుసగా రెండేళ్లు ''ఈ సలనూ కప్ నమ్‌దు'' అంటూ మురిసిపోతున్నారిప్పుడు. గత ఏడాది సాధించిన విజయం గాలివాటం కాదని చాటిచెబుతూ వరుసగా రెండో కప్పుతో తన ఆధిపత్యాన్ని చాటింది బెంగళూరు. రజత్ పాటీదార్ నేతృత్వంలోని ఈ ఆర్సీబీ.. ఆషామాషీ జట్టు కాదనడానికి ఈ ఏడాది ప్రదర్శన తిరుగులేని రుజువు.

వరుసగా తొమ్మిదేళ్ల పాటు కోహ్లి పోరాడాడు.. ఇంకో అరడజను మంది కెప్టెన్లు కలిసి వేర్వేరు సీజన్లలో ప్రయత్నించారు. కానీ ఎవ్వరూ బెంగళూరుకు కప్పు మాత్రం అందించలేకపోయారు. ఐపీఎల్ ఆరంభమైన రెండో ఏడాదే (2009) ఆర్సీబీ ఫైనల్ చేరింది. 2011, 2016లోనూ తుది పోరుకు అర్హత సాధించింది. కానీ ఒక్కసారీ ట్రోఫీని మాత్రం ముద్దాడలేకపోయింది. కోహ్లి నుంచి పగ్గాలందుకున్న డుప్లెసిస్ కూడా జట్టు రాత మార్చలేకపోవడంతో గత ఏడాది రజత్ పాటీదార్ లాంటి పెద్దగా పేరు లేని ఆటగాడిని కెప్టెన్‌ను చేసింది ఆర్సీబీ. మహా మహా ఆటగాళ్లే ఆర్సీబీ కల నెరవేర్చని నేపథ్యంలో పాటీదార్ మాత్రం ఏం చేస్తాడులే అనుకున్నారు చాలామంది. కానీ అతడి సారథ్యంలో బెంగళూరు అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించింది. లీగ్ దశలో ఆధిపత్యం చలాయించడమే కాక, ఫైనల్లోనూ నెగ్గి కప్పు కల నెరవేర్చుకుంది. అప్పుడు ఆర్సీబీ అభిమానుల ఆనందం అంతా ఇంతా కాదు. అయితే లేక లేక ఓ కప్పు నెగ్గిన ఆర్సీబీ.. ఇంకోసారి ఈ అద్భుతాన్ని పునరావృతం చేస్తుందన్న అంచనాలు ఎక్కువగా లేవు. కానీ గత సీజన్‌ను మించిన ఆటతీరుతో, మరింత ఆధిపత్యంతో ఈసారి కప్పు గెలిచింది బెంగళూరు. లీగ్ దశలో అగ్రస్థానంలో నిలవడమే కాక.. రెండో స్థానంలో నిలిచిన గుజరాత్‌ను క్వాలిఫయర్, ఫైనల్ మ్యాచ్‌ల్లో అలవోకగా ఓడించడం ఆర్సీబీ ఎంత మేటి జట్టుగా ఎదిగిందో చెప్పడానికి రుజువు.

**నడిపించిన నాయకుడు:** నిరుడు బెంగళూరు జట్టులో అసాధారణ మార్పులేమీ జరిగిపోలేదు. అయినా ఆ జట్టు కప్పు గెలవగలిగిందంటే.. కెప్టెన్‌గా పాటీదార్ చూపించిన నైపుణ్యమే ముఖ్య కారణం. ఉన్న వనరులను సమర్థంగా ఉపయోగించుకోవడం ద్వారా అతను ఆర్సీబీ రాత మార్చాడు. ఈసారి కూడా అతను అదే పని చేశాడు. భువనేశ్వర్ లాంటి సీనియర్, రసిక్ సలామ్ లాంటి జూనియర్ నుంచి అత్యుత్తమ ప్రదర్శన రాబట్టుకోవడంలో పాటీదార్ ముద్ర స్పష్టం. ఆరంభంలో కొన్ని మ్యాచ్‌లకు హేజిల్‌వుడ్ లేకపోయినా.. బౌలింగ్ దళం ఆత్మవిశ్వాసం దెబ్బ తినకుండా చూసుకున్నాడు. తాత్కాలికంగా డఫీ సేవలను సమర్థంగా ఉపయోగించుకున్నాడు. పడిక్కల్‌ను ఇంపాక్ట్ ప్లేయర్‌గా దించడం, కృనాల్ పాండ్యను బ్యాటింగ్‌లోనూ తురుపుముక్కలా ప్రయోగించడంలోనూ పాటీదార్ నాయకత్వ నైపుణ్యాలను చూడొచ్చు. మ్యాచ్‌ల్లో బౌలింగ్ మార్పులు, ఫీల్డింగ్ ఏర్పాట్లలోనూ రజత్ తన ప్రత్యేకతను చాటుకున్నాడు. ఇక బ్యాటర్‌గా మిడిలార్డర్లో కీలక పాత్ర పోషిస్తూ జట్టును ముందుండి నడిపించాడు. క్వాలిఫయర్‌లో అతనెంత విలువైన ఇన్నింగ్స్‌లు ఆడాడో తెలిసిందే.

**ఒకవైపు నిలకడ..** ఇంకోవైపు విధ్వంసం: ఐపీఎల్ ఆరంభం నుంచి ఆర్సీబీకి ఎప్పుడూ బ్యాటింగే బలంగా ఉండేది. కానీ ఆ జట్టుకు అతి పెద్ద సమస్య.. కోహ్లి సహా కొందరు స్టార్ బ్యాటర్ల మీద ఎక్కువ ఆధారపడడం, సమష్టితత్వం లేకపోవడం. కానీ గత సీజన్‌లోనే ఆ బలహీనతను అధిగమించిన ఆర్సీబీ.. ఈసారి బ్యాటింగ్‌లో మరింత బలపడింది. కోహ్లి లాంటి నిలకడైన బ్యాటర్‌కు తోడు పడిక్కల్, పాటీదార్, సాల్ట్, వెంకటేశ్ అయ్యర్, టిమ్ డేవిడ్, కృనాల్ పాండ్య లాంటి విధ్వంసకారులు తోడై ఆ జట్టు బ్యాటింగ్‌ను తిరుగులేని స్థాయికి తీసుకెళ్లారు. ఓ ఎండ్‌లో కోహ్లి యాంకర్ పాత్రను పోషిస్తుంటే.. మిగతా బ్యాటర్లు చెలరేగడం చాలా మ్యాచ్‌ల్లో చూశాం. అవసరమైనపుడు కోహ్లి సైతం వేగం పెంచి ఆడాడు. ఫైనల్లోనూ అతనెలా చెలరేగాడో తెలిసిందే. ఒకరు పోతే ఇంకొకరు అన్నట్లు బోలెడంతమంది విధ్వంసకారులు అందుబాటులో ఉండడంతో ఆర్సీబీ బ్యాటింగ్ ప్రమాదకరంగా మారింది. కాబట్టే 200+ స్కోర్లు చేయడం, లక్ష్యాలను ఛేదించడం ఆర్సీబీకి తేలికైంది. ఈ సీజన్లో మరే జట్టూ బెంగళూరంత నిలకడగా బ్యాటింగ్ చేయలేదు.

**బంతి పదునెక్కింది..:** ఎంత గొప్ప బ్యాటింగ్ ఉన్నా.. బౌలింగ్ సరిగా లేని జట్టు కప్పు గెలవడం కష్టం. చాలా ఏళ్లు బౌలింగ్ వైఫల్యంతో సతమతం అయిన ఆర్సీబీ.. గత సీజన్ నుంచి బంతి దాడిని ఎంతో మెరుగుపరుచుకుంది. ముఖ్యంగా హేజిల్‌వుడ్ ఆ జట్టుకు అతి పెద్ద బలంగా మారాడు. అతడికి భువనేశ్వర్‌కుమార్ రూపంలో అనుభవజ్ఞుడైన భాగస్వామి దొరికాడు. కెరీర్ అయిపోయిందనుకున్న భువి.. ఈ సీజన్లో విజృంభించిన తీరు అసామాన్యం. అతను 28 వికెట్లతో ఈ సీజన్లో టాప్2 బౌలర్‌గా నిలిచాడు. కొంత ఆలస్యంగా లీగ్‌లో అడుగు పెట్టిన హేజిల్‌వుడ్ 15 వికెట్లతో సత్తా చాటాడు. ఈ సీజన్ ఆరంభంలో అతను కొన్ని మ్యాచ్‌లకు అందుబాటులో లేకపోయినా.. ఆర్సీబీ ఇబ్బంది పడలేదు. జాకబ్ డఫీని చక్కగా ఉపయోగించుకుంది. రసిఖ్ లాంటి యువ పేసర్ కూడా ఆ జట్టుకు భలేగా కలిసొచ్చాడు. స్పిన్‌లో ఆర్సీబీ కొంచెం బలహీనమే అయినా.. కృనాల్ పాండ్య (14 వికెట్లు) జట్టు అవసరాలను బాగానే తీర్చాడు.

## ప్రజ్ఞపై గుకేశ్ విజయం



ఓస్లో: నార్వే చెస్ టోర్నీ ఓపెన్ విభాగంలో దొమ్మరాజు గుకేశ్ పుంజుకున్నాడు. అతడు మూడు వరుస ఓటముల అనంతరం విజయం సాధించాడు. గుకేశ్ అయిదో రౌండ్లో ప్రజ్ఞానందపై 47 ఎత్తుల్లో గెలిచాడు. 6.5 పాయింట్లతో అతడు మూడో స్థానానికి ఎగబాకాడు. ప్రజ్ఞ (6 పాయింట్లు) నాలుగో స్థానంలో ఉన్నాడు. ఫిరౌజా (10 పాయింట్లు), వెస్లీ సో (8.5) వరుసగా తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నారు. మహిళల విభాగంలో దివ్య అగ్రస్థానానికి దూసుకెళ్లింది. అయిదో రౌండ్లో ఆమె జు జినర్ (చైనా)పై 84 ఎత్తుల్లో గెలిచింది.

# రెండో కప్పు.. భలే కిక్కు

### ఐపీఎల్19 విజేత బెంగళూరు

**టైటిల్ నిలబెట్టుకున్న పాటీదార్ సేన**
**ఛేదనలో మెరిసిన కోహ్లి**
**విజృంభించిన భువి, హేజిల్‌వుడ్, రసిఖ్**
**ఫైనల్లో టైటాన్స్ ఓటమి**

**తమతో పాటే మొదలైన ముంబయి, చెన్నై అయిదేసి సార్లు విజేతగా నిలిచాయి. అప్పుడే వచ్చిన ఫ్రాంఛైజీ సైతం కప్పను ముద్దాడింది. కానీ ఒక్క టైటిల్ కోసం ఆ జట్టు ఎంతగా నిరీక్షించిందో..! ఎంతగా ఆరాటపడిందో! ఎన్ని అవమానాలను ఎదుర్కొందో..! జట్టు బాలేదా అంటే.. కాదు! అత్యంత ఆదరణ ఉన్న ఫ్రాంఛైజీ అయినా.. స్టార్లకు కొదవ లేకున్నా.. అవకాశాలు వచ్చినా.. ఆ జట్టు కల కలగానే ఉండిపోయింది 17 సీజన్ల వరకు. కప్ప ఊరించింది.. వేధించింది. కానీ ఆలస్యమైనా.. ఒక్కసారిగా ఆర్సీబీ కథే మారిపోయింది. సుదీర్ఘ నిరీక్షణ ఫలమా అన్నట్లు... గూడుకట్టుకున్న బాధంతా కరిగిపోయేట్లు.. కరవంతా తీరేట్లు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండో ఐపీఎల్ ట్రోఫీని గెలుచుకుంది. ఐపీఎల్ చరిత్రలో టైటిల్ నిలబెట్టుకున్న మూడో జట్టుగా ఘనత సాధించింది. నిరుడు కలల కప్పను అందుకున్న బెంగళూరు.. ఆ ప్రదర్శన గాలివాటమేమీ కాదని నిరూపిస్తూ.. అభిమానులను మురిపిస్తూ.. 2026లోనూ విజేతగా నిలిచింది. అహ్మదాబాద్‌లో జరిగిన ఫైనల్లో ఆర్సీబీ..గుజరాత్ టైటాన్స్‌ను మట్టికరిపించింది.**



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండో టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన ఐపీఎల్19 ఫైనల్లో ఈ డిఫెండింగ్ ఛాంపియన్ 5 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌పై విజయం సాధించింది. మొదట గుజరాత్ తీవ్రంగా తడబడింది. బెంగళూరు బౌలర్ల ధాటికి 8 వికెట్లకు 155 పరుగులే చేయగలిగింది. రసిఖ్ సలామ్ (3/27), భువనేశ్వర్ (2/29), హేజిల్‌వుడ్ (2/37), కృనాల్ పాండ్య (1/23) ఆ జట్టును దెబ్బతీశారు. వాషింగ్టన్ సుందర్ (50 నాటౌట్; 37 బంతుల్లో 5×4) టాప్ స్కోరర్. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కోహ్లి (75 నాటౌట్; 42 బంతుల్లో 9×4, 3×6) చెలరేగడంతో లక్ష్యాన్ని ఆర్సీబీ 18 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వెంకటేశ్ అయ్యర్ (32; 16 బంతుల్లో 4×4, 2×6) రాణించాడు. తొలి క్వాలిఫయర్‌లో బెంగళూరు 92 పరుగుల తేడాతో గుజరాత్‌ను చిత్తు చేసిన సంగతి తెలిసిందే

**నిలిచిన విరాట్:** తక్కువ లక్ష్యాన్నే నిర్దేశించినా.. ఆర్సీబీపై ఒత్తిడి తేవడానికి టైటాన్స్ ప్రయత్నించింది. కానీ ఆ జట్టుకు కోహ్లి అడ్డుగా నిలిచాడు. కడవరకూ క్రీజులో ఉండి తన జట్టును గెలిపించాడు. గుజరాత్ బ్యాటర్లు తడబడ్డ అదే పిచ్‌పై ఛేదనను బెంగళూరు ధాటిగా ఆరంభించింది. ఓపెనర్లు కోహ్లి, వెంకటేశ్ అయ్యర్ ధనాధన్ షాట్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. రబాడ ఓవర్లో అయ్యర్ మూడు ఫోర్లు, సిక్స్ బాదాడు. సిరాజ్ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన కోహ్లి.. రబాడ బౌలింగ్‌లో వరుసగా 4, 4, 6, 4తో విరుచుకుపడ్డాడు. 4 ఓవర్లకే 55/0తో లక్ష్యాన్ని మరింత తేలికగా మార్చుకుంది ఆర్సీబీ. ఆ దశలో వరుస ఓవర్లలో అయ్యర్, పడిక్కల్ (1)ను ఔట్ చేసి పోటీలోకి వచ్చే ప్రయత్నం చేసింది టైటాన్స్. కానీ పాటీదార్ (15)తో కలిసి కోహ్లి ఇన్నింగ్స్ నడిపించాడు. పరుగుల వేగం తగ్గినా ఆర్సీబీ కంగారూ పడాల్సిన అవసరం లేకపోయింది. 8 ఓవర్లకు స్కోరు 88/2. కానీ రషీద్ ఖాన్ ఒకే ఓవర్లో పాటీదార్, కృనాల్ (1)ను ఔట్ చేసి మ్యాచ్‌లో కాస్త ఆసక్తి నింపాడు. గుజరాత్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఆ తర్వాత పరుగులు అంత తేలికగా రాలేదు. కానీ చక్కని బ్యాటింగ్‌ను కొనసాగించిన కోహ్లి.. ఎలాంటి నాటకీయతకు అవకాశమివ్వలేదు. టిమ్ డేవిడ్ (24; 17 బంతుల్లో 3×4, 1×6), జితేశ్ శర్మ (11 నాటౌట్)లతో కలిసి పని పూర్తి చేశాడు.

**తేలిపోయిన గుజరాత్:** మొదట టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న బెంగళూరు బంతితో సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మందకొడి పిచ్‌పై షాట్లు ఆడడం టైటాన్స్‌కు కష్టమైపోయింది. టాప్ ఆర్డర్‌పై అతిగా ఆధారపడ్డందుకు ఆ జట్టు మూల్యం చెల్లించుకుంది. పేసర్లు భువనేశ్వర్, హేజిల్‌వుడ్ మరోసారి సత్తా చాటారు. మూడో ఓవర్లో గిల్ (10)ను ఔట్ చేయడం ద్వారా టైటాన్స్ పతనాన్ని హేజిల్‌వుడ్ ఆరంభించగా.. తర్వాతి ఓవర్లో సుదర్శన్ (12)ను భువి ఔట్ చేశాడు. అక్కడి నుంచి టైటాన్స్‌కు అన్నీ కష్టాలే. వికెట్లు క్రమం తప్పకుండా పోగా.. స్కోరు బోర్డు కష్టంగా కదలింది. నిశాంత్ సింధు (20), బట్లర్ (19) జట్టును ఆదుకునేందుకు ప్రయత్నించారు కానీ.. అది కాసేపే. 13వ ఓవర్లో బట్లర్ స్టంపౌటయ్యే సమయానికి స్కోరు 73 మాత్రమే. అయితే మరో ఎండ్‌లో సుందర్ నిలబడ్డాడు. అర్షద్ ఖాన్ (15), తెవాతియా (7), హోల్డర్ (7), రషీద్ ఖాన్ (7) ఔటైనా.. సుందర్ నిలబడడంతో గుజరాత్ జట్టు కష్టంగానైనా 150 దాటింది.

**గుజరాత్ ఇన్నింగ్స్:** సుదర్శన్ (సి) జితేశ్ (బి) భువనేశ్వర్ 12; గిల్ (సి) పాటీదార్ (బి) హేజిల్‌వుడ్ 10; నిశాంత్ (సి) పడిక్కల్ (బి) రసిఖ్ 20; బట్లర్ (స్టంప్డ్) జితేశ్ (బి) కృనాల్ 19; సుందర్ నాటౌట్ 50; అర్షద్ (సి) రసిఖ్ (బి) హేజిల్‌వుడ్ 15; తెవాతియా (సి) పాటీదార్ (బి) రసిఖ్ 7; హోల్డర్ (సి) హేజిల్‌వుడ్ (బి) భువనేశ్వర్ 7; రషీద్ ఖాన్ (సి) షెపర్డ్ (బి) రసిఖ్ 7; రబాడ నాటౌట్ 3; ఎక్స్‌ట్రాలు 5 మొత్తం: (20 ఓవర్లలో 8 వికెట్లకు) 155; వికెట్ల పతనం: 122, 226, 355, 473, 599, 6115, 7142, 8151; బౌలింగ్: డఫీ 40380; భువనేశ్వర్ 40292; హేజిల్‌వుడ్ 40372; రసిఖ్ 40273; కృనాల్ 40231.

**బెంగళూరు ఇన్నింగ్స్:** వెంకటేశ్ (సి) రబాడ (బి) సిరాజ్ 32: కోహ్లి నాటౌట్ 75; పడిక్కల్ (సి) అర్షద్ (బి) రబాడ 1; పాటీదార్ (సి) రబాడ (బి) రషీద్ 15; కృనాల్ ఎల్బీ (బి) రషీద్ 1; డేవిడ్ (సి) బట్లర్ (బి) అర్షద్ 24; జితేశ్ నాటౌట్ 11; ఎక్స్‌ట్రాలు 2; మొత్తం: (18 ఓవర్లలో 5 వికెట్లకు) 161; వికెట్ల పతనం: 162, 263, 389, 491, 5132; బౌలింగ్: సిరాజ్ 40361; రబాడ 30441; హోల్డర్ 20160; రషీద్ 40252; అర్షద్ 40321; ప్రసిద్ధ 1070

**బలహీనత మీద కొట్టారు**

ఒక పెద్ద మ్యాచ్‌లో మన బలాన్ని బట్టి ఆడడం కంటే ప్రత్యర్థి బలహీనతను చూసి దెబ్బ కొట్టడం కీలకం. ఆర్సీబీ ఆదివారం అదే చేసింది. ఈ సీజన్లో ఫైనల్ ముందు వరకు గుజరాత్ చేసిన మొత్తం పరుగుల్లో 65 శాతం సాధించింది టాప్3 బ్యాటర్లే. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్.. మూడో నంబర్ బ్యాటర్ జోస్ బట్లర్‌లే జట్టు బ్యాటింగ్ భారాన్నంతా మోస్తూ వచ్చారు. అయితే క్వాలిఫయర్1లో ఓపెనర్లను త్వరగా ఔట్ చేసి గుజరాత్‌ను దెబ్బ తీసిన ఆర్సీబీ.. ఫైనల్లోనూ అదే చేసింది. రెండో క్వాలిఫయర్లో ఏకంగా 167 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన ఓపెనర్లను 26 పరుగులకే పెవిలియన్ చేర్చడంతో గుజరాత్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురు దెబ్బ తగిలింది. బట్లర్ కాసేపు నిలిచినా, అతను పెద్ద స్కోరు చేయకుండానే వెనుదిరగడంతో జీటీ పనైపోయింది. టాప్3 బ్యాటర్ల మీద అతిగా ఆధారపడడం జీటీ కొంప ముంచింది. ఆ బలహీనత మీదే దెబ్బ కొట్టి కప్పు ఎగరేసుకుపోయింది ఆర్సీబీ.

**ప్రైజ్‌మనీ,....** విజేత: రూ.20 కోట్లు; రన్నరప్: రూ.13 కోట్లు; క్వాలిఫయర్‌లో ఓడిన జట్టు: రూ.7 కోట్లు; ఎలిమినేటర్‌లో ఓడిన జట్టు: రూ.6.5 కోట్లు

**4....** ఒకటి కంటే ఎక్కువసార్లు ఐపీఎల్ ట్రోఫీని గెలిచిన నాలుగో జట్టు బెంగళూరు. చెన్నై, ముంబయి చెరో అయిదుసార్లు విజేతగా నిలవగా.. కోల్‌కతా మూడుసార్లు ఛాంపియన్ అయింది.



కోహ్లి, రసి



ఐపీఎల్-19 ఫైనల్ ఇన్నింగ్స్ విరామంలో అహ్మదాబాద్ స్టేడియంలో డ్రోన్ షో

## వైభవ్ సిక్సర్లవంశీ




ఒక సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా వైభవ్ నిలిచాడు. అతడు మొత్తం 16 ఇన్నింగ్స్‌ల్లో 237.30 స్ట్రైక్‌రేట్‌తో 776 పరుగులు చేశాడు. ఓ సీజన్‌లో అత్యధిక సిక్సర్ల ఘనత అతడిదే. మొత్తం 72 సిక్సర్లు కొట్టాడు. 63 ఫోర్లు బాదాడు. సూర్యవంశీ ఈ టోర్నీలో ప్రతి 4.5 బంతులకు ఒక సిక్స్ రాబట్టాడు. అతడు మూడు శతకాలు (93, 97, 96) చేజార్చుకున్నాడు. ఐపీఎల్‌లో వేగంగా 1000 పరుగులు (440 బంతుల్లో) సాధించిన ఆటగాడిగా ఘనత సాధించాడు. మొత్తం సీజన్‌లో పవర్‌ప్లేలో అత్యధిక పరుగులు (521) చేసిన మొదటి ఆటగాడిగానూ రికార్డు సృష్టించాడు. డేవిడ్ వార్నర్ (467 పరుగులు, 2016లో)ను వైభవ్ అధిగమించాడు.

**వైభవ్..** ఆరెంజ్ క్యాప్‌తో పాటు సూపర్ స్ట్రైకర్ (237.30), ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ద సీజన్, మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ (436.5 పాయింట్లు), అత్యధిక సిక్సర్ల అవార్డులు దక్కించుకున్నాడు. అత్యధిక డాట్ బాల్స్ అవార్డు సిరాజ్ (172) ఖాతాలో చేరింది.

## వెంకట్రామ్ పసిడి పరుగు

### ఆసియా అండర్-20 అథ్లెటిక్స్



వెంకట్రామ్

హాంకాంగ్: ఆసియా అండర్20 ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ కుర్రాడు మొగిలి వెంకట్రామ్ రెడ్డి సత్తాచాటాడు. ఆదివారం పురుషుల 800 మీటర్లలో నిమిషం 48.27 సెకన్లలో పరుగు పూర్తి చేసి స్వర్ణం చేజిక్కించుకున్నాడు. ఈ విభాగంలో భారత్‌కు ఇదే తొలి పతకం. 800 మీటర్ల పరుగులో వెంకట్రామ్‌కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన. ఆగస్టులో జరిగే ప్రపంచ అండర్20 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌నకు అతడు అర్హత సాధించాడు. మహిళల 4×400 మీటర్ల రిలేలో.. నీరు, భూమిక, తహుర, సెహనూర్‌లతో కూడిన భారత బృందం (3 నిమిషాల 38.07 సెకన్లు) స్వర్ణం దక్కించుకుంది. మహిళల 5 వేల మీటర్ల పరుగులో ముస్కాన్ (16 నిమిషాల 53.08 సెకన్లు) పసిడి సొంతం చేసుకుంది. మహిళల 4×100 మీ. రిలేలో రజతం, పురుషుల 4×400 మీ. రిలేలో కాంస్య పతకాలు భారత్ కైవసం అయ్యాయి. ఆఖరి రోజు భారత్‌కు మూడు స్వర్ణాలు వచ్చాయి. భారత్ మొత్తం 19 పతకాల (10 పసిడి, 5 రజతం, 4 కాంస్యం)తో రెండో స్థానంతో టోర్నీని ముగించింది. చైనా 25 పతకాల (14 స్వర్ణం, 9 రజతం, 2 కాంస్యం)తో అగ్రస్థానంలో నిలవగా.. జపాన్ 18 పతకాలతో మూడో స్థానంతో సరిపెట్టుకుంది.